STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 337 | ఎడిటర్ : అలీ ముర్తుజా | గురువారం 5 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

ఏడాదిలో మళ్లీ కేసీఆర్ సర్కారే!

- అభివృద్ధిని చూసే నగర ప్రజలు మమ్మల్ని గెలిపించారు
- కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలకు పల్లెలు మోసపోయాయి
- చిత్తశుద్ధి ఉంటే మియాపూర్ భూములను అమరవీరులకు ఇవ్వాలి
- రాష్ట్రంలో పడిపోయిన స్థిరాస్తి వ్యాపారం

2

- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- రైతు గర్జన స్ఫూర్తితో పోరాడాలి!
- బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం
- తెలంగాణ భవన్‌లో పలువురి చేరికలు

వివరాలు 3లో..



యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే 'సదర్ సమ్మేళనం' కేవలం ఒక వర్గానికే పరిమితం కాదని, అది యావత్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సజీవ సాక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించడంతో పాటు, ఐదు కోట్ల రూపాయల నిధులతో అధికారికంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ స్టేడియం వేదికగా జరిగిన అఖిల భారత సమ్మేళనంలో పాల్గొన్న ముఖ్యమంత్రి.. యాదవుల గొప్పదనాన్ని, నగర అభివృద్ధిలో వారి పాత్రను వేనోళ్ల పొగిడారు. ఒకప్పటి 'గొల్లకొండ' ప్రాంతమే నేటి గోల్కొండ కోటగా మారిందని, విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో యాదవ సోదరుల కృషి ఎంతో ఉందని ఆయన కొనియాడారు.

సదర్.. తెలంగాణ ఆత్మగౌరవం

రాష్ట్ర పండుగగా గుర్తింపు.. 5 కోట్ల నిధుల కేటాయింపు

- జనాభా ప్రాతిపదికన యాదవులకు సముచిత స్థానం
- దేశానికే ఆదర్శంగా మన కులగణన విధానం
- గతంలో గోల్కొండ కోట పేరు గొల్లకొండనే!
- నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర అమోఘం
- సదర్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వేడుకల్లో పాల్గొన్న తేజస్వీ యాదవ్, దత్తాత్రేయ..

హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్): సదర్ సమ్మేళనం కేవలం యాదవులకే పరిమితం కాదని, అది యావత్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో అట్టహాసంగా నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై యాదవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహించలేదని గుర్తుచేసిన ఆయన.. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే యాదవుల విజ్ఞప్తి మేరకు దీనిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ వేడుకల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 5 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించి తెలంగాణ మోడల్‌ను దేశానికి పరిచయం చేశామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. సమాజంలోని అన్ని వర్గాలకు

మిగతా 2 లో



పిల్లలు మెచ్చిన రంగుల్లోనే దుస్తులు!

విద్యార్థుల అభిప్రాయాలు సేకరించాలి

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

మోదీ దేశద్రోహి.. 5 నిమిషాల్లో నిరూపిస్తా!

- ప్రధానితో ముఖాముఖి చర్చకు రాహుల్ గాంధీ సవాల్
- మోదీని నియంత్రిస్తున్నది అమెరికా అధ్యక్షుడు ట్రంపే
- అదానీ పోర్టులో పట్టుబడిన మత్తు పదార్థాలు ఏమయ్యాయి?
- పంజాబ్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో అగ్రనేత నిలదీత

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. మోదీ దేశద్రోహి అని, ఆయన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే తనతో ముఖాముఖి చర్చకు రావాలని, కేవలం ఐదు నిమిషాల్లోనే ఈ విషయాన్ని నిరూపిస్తానని సవాల్ విసిరారు.

2



ఓటమి భయంతోనే సంస్థలపై నిందలు!

కాంగ్రెస్ అబద్ధాలను తిప్పికొట్టాలి

- జాబితా సవరణ ఈ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదు
- ఇరవై ఏళ్ల తర్వాత ప్రక్షాళన చేపట్టిన ఎన్నికల సంఘం

వివరాలు 3లో..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు





2

వికసిత భారత్ ప్రయాణంలో గనుల రంగం కీలక పాత్ర పోషించనుందని, ముఖ్యంగా అత్యంత అవసరమైన ఖనిజాల (క్రిటికల్ మినరల్స్) దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఆత్మనిర్భరత సాధించేందుకు కృషి చేయాల్సి ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు.

గనుల రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యం!

- క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సామర్థ్యం పెంపునకు కేంద్రం చర్యలు
- రూ.2,814 కోట్లతో క్యాపెక్స్ సపోర్ట్ స్కీమ్‌కు కేబినెట్ ఆమోదం

2

ఫాం 6 ద్వారా మళ్లీ ఓటరుగా నమోదుకండి

ప్రధాన ఎన్నికల సంఘం



4

ఎన్నికల కమిషనర్లు చట్టానికి అతీతులా?

జీవితకాల చట్టపరమైన రక్షణపై సుప్రీంకోర్టులో కీలక విచారణ




ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనను సవాలు చేస్తూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై కీలక విచారణ జరిగింది.

4

రూ.400 కోట్ల సైబర్ వల!

నలుగురిని అరెస్టు చేసిన హైదరాబాద్ ఈడీ

3



ముంచెత్తిన 'మురసు'.. అన్నదాతకు కన్నీళ్లు!



సురక్షితంగా రక్షణ దళం!

3

- చేతికొచ్చిన పంటలు వరద పాలు..
- ఉప్పొంగిన వాగులు.. కట్టలు తెంచుకున్న చెరువులు
- తక్షణమే ఆదుకోవాలని రైతుల వేడుకోలు

అవినీతి ఊబిలో అధికారి!

ఏసీబీ వలలో మెప్మా అదనపు సంచాలకుడు

3



మోదీ దేశద్రోహి అని 5 నిమిషాల్లో నిరూపిస్తా!

ప్రధానితో ముఖాముఖి చర్చకు రాహుల్ గాంధీ సవాల్

మోదీని నియంత్రిస్తున్నది అమెరికా అధ్యక్షుడు ట్రంపే

అదానీ పోర్టులో పట్టుబడిన మత్తు పదార్థాలు ఏమయ్యాయి?

పంజాబ్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో అగ్రనేత నిలదీత



సంగ్రూర్, నవంబర్ 5 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. మోదీ దేశద్రోహి అని, ఆయన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే తనతో ముఖాముఖి చర్చకు రావాలని, కేవలం ఐదు నిమిషాల్లోనే ఈ విషయాన్ని నిరూపిస్తానని సవాల్ విసిరారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో బుధవారం నిర్వహించిన భారీ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఏడాదిలోపే కుప్పకూలిపోతుందని జోస్యం చెప్పారు. ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు తాను ఎప్పుడూ సిద్ధమేనని రాహుల్ స్పష్టం చేశారు. చర్చకు మధ్యవర్తిగా ఎవరిని కూర్చోబెట్టినా తనకు అభ్యంతరం లేదన్నారు. చట్టసభల్లో చర్చిద్దామని అధికార పక్ష నేతలు చెబుతున్నారని, కానీ లోక్‌సభలో తాను మాట్లాడేందుకు కనీస అవకాశం ఇవ్వకుండా అడుగడుగునా మైక్ కట్ చేస్తున్నారని ఆరోపించారు.

ఆ డ్రగ్స్ ఏమయ్యాయి..

దేశం నుంచి మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మూడేళ్ల గడువు విధించడంపై రాహుల్ ఎద్దేవా చేశారు. ఆ సమయానికి ఆయన అసలు ఆ పదవిలో ఉంటారో లేదోనని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని అదానీ పోర్టులో గతంలో పట్టుబడిన వేల కిలోల హెరాయిన్ ఏమైందో జాతికి వివరించాలని డిమాండ్ చేశారు. నేరగాళ్లకు అమిత్ షా అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. శాంతిభద్రతల గురించి మాట్లాడే ముందు మణిపూర్ పరిస్థితులపై ఆయన సమాధానం చెప్పాలని నిలదీశారు. పంజాబ్‌లో శాంతిభద్రతల పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని రాహుల్ పేర్కొన్నారు. ప్రముఖ గాయకుడు సిద్ధూ మూసేవాలాను బహిరంగంగా హత్య చేయడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఢిల్లీ నుంచి పాలన సాగించే ఆమ్ ఆద్మీ పార్టీతో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. యువతకు ఉపాధి కల్పించడం, రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ప్రజలు తమకే మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

గనుల రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యం!

క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సామర్థ్యం పెంపునకు చర్యలు

రూ.2,814 కోట్లతో క్యాపెక్స్ సపోర్ట్ స్కీమ్‌కు కేబినెట్ ఆమోదం

దాదాపు పదివేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం

ఏటా 25 వేల కోట్ల విలువైన మినరల్స్ ఉత్పత్తి :కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, నవంబర్ 4 (సమయం న్యూస్) : వికసిత భారత్ ప్రయాణంలో గనుల రంగం కీలక పాత్ర పోషించనుందని, ముఖ్యంగా అత్యంత అవసరమైన ఖనిజాల (క్రిటికల్ మినరల్స్) దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఆత్మనిర్భరత సాధించేందుకు కృషి చేయాల్సి ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో లిథియం, నికెల్ లాంటి ఖనిజాల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు రూ.2,814 కోట్లతో కేంద్ర గనుల శాఖ తీసుకురానున్న 'క్యాపెక్స్ సపోర్ట్ స్కీమ్'కు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ప్రధానికి కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గణనీయంగా దిగుమతుల భారం..



కొత్త ప్రోత్సాహక పథకం ద్వారా దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, ఏటా రూ.25,000 కోట్ల విలువైన ఖనిజాలు ఉత్పత్తి అవుతాయని మంత్రి అంచనా వేశారు. ఈ పథకం ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు బ్యాటరీలు, స్వచ్ఛ విద్యుత్ తదితర కార్యక్రమాలకు అవసరమైన ముడి ఖనిజాలను అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఫోన్లు, బ్యాటరీల తయారీలో అత్యంత కీలకమైన లిథియం, నికెల్ కోసం పూర్తిగా దిగుమతులపై ఆధారపడుతున్నామని, 2017-18లో రూ.6,500 కోట్లుగా ఉన్న లిథియం దిగుమతుల భారం ప్రస్తుతం రూ.50,000 కోట్లకు పెరిగిందని ఆయన వివరించారు.

విదేశాల్లో గనుల కొనుగోలు..

ఖనిజాల దిగుమతులపై ఇప్పటికే సుంకం ఎత్తేశామని, తొలిసారిగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో నాలుగు ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు. ఆత్మనిర్భరత సాధించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా అర్జెంటీనాలో ఐదు లిథియం గనులను కొనుగోలు చేశామన్నారు. దేశంలో 901 అన్వేషణ ప్రాజెక్టులను చేపట్టామని, 56 బ్లాకులను విజయవంతంగా వేలం వేశామని తెలిపారు. ఖనిజాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు రూ.1,500 కోట్లతో ప్రారంభించిన పథకానికి విశేష స్పందన లభిస్తోందని మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.

సదర్.. తెలంగాణ ఆత్మగౌరవం!

(మొదటి పేజీ తరువాయి..)

ఎవరెంత ఉంటే వారికి అంత శాతం వాటా కల్పించాలన్న లక్ష్యంతోనే ఈ కులగణన చేపట్టామన్నారు. తమ ప్రభుత్వం యాదవ సామాజిక వర్గానికి రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యం కల్పిస్తోందని వివరించారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని.. అలాగే ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించడంతో పాటు అక్కడి గోశాల బాధ్యతలను సైతం అప్పగించామని తెలిపారు. రాబోయే రోజుల్లో జనాభా ప్రాతిపదికన యాదవులకు తగిన వాటా కల్పించి వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.

గొల్లకొండ నుంచి విశ్వనగరం దాకా..

ప్రస్తుతం మనం గోల్కొండ కోటగా పిలుస్తున్న ప్రాంతానికి గతంలో 'గొల్లకొండ'గా పేరుండేదని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. హైదరాబాద్ నగరం జాతీయస్థాయిలో పేరు



ప్రతిష్ఠలు సాధించి విశ్వనగరంగా ఎదగడంలో యాదవుల పాత్ర ఎంతో ఉందంటూ ప్రశంసించారు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన వివిధ ప్రాంతాల ప్రజలను వారు ఆదరించి అక్కున చేర్చుకున్నారని, శాంతిభద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసీ పునరుజ్జీవం, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ లాంటి బృహత్తర ప్రాజెక్టులతో మరింత అభివృద్ధి సాధించనున్నామని.. ఈ అభివృద్ధి యజ్ఞంలో యాదవులు ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.

సమ్మేళనంలో ప్రముఖుల సందడి..

యాదవుల సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పే ఈ వేడుకల్లో బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, స్థానిక ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, సదర్ ఉత్సవ కమిటీ చైర్మన్ అంజన్‌కుమార్ యాదవ్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ సమ్మేళనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు

పిల్లలు మెచ్చిన రంగుల్లోనే దుస్తులు!

- **విద్యార్థుల అభిప్రాయాలు సేకరించాలి**
- **వారు కోరుకునే ఆకృతులకే ప్రాధాన్యం ఇవ్వాలి**
- **వచ్చే ఏడాదికి ఇప్పుడే విధివిధానాలు ఖరారు**
- **బడి తెరిచేనాటికే పిల్లలకు సామగ్రి అందాలి**
- **అధికారుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్) : ప్రభుత్వ బడుల విద్యార్థులకు అందజేసిన పాఠశాల దుస్తులపై వారి నుంచి అభిప్రాయాలు సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇలా అభిప్రాయాలు సేకరించడం వల్ల భవిష్యత్తులో ఎక్కువ మంది విద్యార్థులు కోరుకునే రంగులు, ఆకృతులకు ప్రాధాన్యం ఇవ్వవచ్చని ఆయన సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్లో వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దుస్తులు, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

గతానికంటే నాణ్యంగా..

గతంతో పోలిస్తే ఎంతో నాణ్యమైన దుస్తులను, ఆకర్షణీయమైన రంగులు, ఆకృతులతో విద్యార్థులకు అందజేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. దుస్తులతో పాటు టైలు, బెల్టులు, గుర్తింపు కార్డులు, బూట్లు, మేజోళ్లు, ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, తివాచీలు, బడి సంచుల పంపిణీ దాదాపు పూర్తయిందని ఈ సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఒకట్రెండు సంస్థల పరిధిలో కొన్ని వస్తువుల పంపిణీ 95 శాతం వరకు పూర్తయిందని వివరించగా.. ఆ వస్తువుల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

బడి తెరిచే నాటికే చేతికి..

వచ్చే ఏడాదికి విద్యార్థులకు అందజేసే దుస్తులు, ఇతర సామగ్రికి సంబంధించి విధివిధానాలను ఇప్పుడే రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు అందజేసే వస్తువుల జాబితా రూపకల్పన నుంచి.. టెండర్లు,



సరఫరా, పంపిణీ వరకు ప్రతిదీ నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు తెరిచిన రోజునే మొత్తం వస్తువులు పిల్లలకు అందేలా ఇప్పటినుంచే పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్, సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, రాష్ట్ర గిరిజన, వెనుకబడిన తరగతుల శాఖల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



విద్యతోనే విలువ, ఉన్నత స్థానం

నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

కరీంనగర్‌లో విద్యార్థులకు గైడ్స్ పంపిణీ

కరీంనగర్, నవంబర్ 4 (సమయం న్యూస్) : విద్యతోనే మనిషికి విలువ అని, ఉన్నత స్థానం లభిస్తుందని, కష్టపడి చదివి కలలను సాకారం చేసుకోవాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులందరూ, ముఖ్యంగా ఆడపిల్లలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో 26 ఏండ్లుగా విద్యార్థులకు గైడ్లతో పాటు వారి ఉన్నత విద్యకు సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. ఎంఐఎం పార్టీ తరఫున ఇప్పటి వరకు 4 లక్షలకు పైగా విద్యార్థుల చదువుకు సహకారం అందించినట్టు చెప్పారు. వేలాది మంది దారుస్సలాంకు వచ్చి, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీకి కృతజ్ఞతలు తెలిపిన సందర్భాలున్నాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విద్యతోనే సమాజంలో సమూల మార్పులు చేయవచ్చని, ఆడ పిల్ల చదివితే, కొన్ని తరాలు బాగుపడుతాయని సూచించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు వందకు వంద మార్కులే లక్ష్యంగా చదవాలన్నారు. ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలన్నారు. చదువుతో గౌరవం, విలువ లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి పైగా విద్యార్థులకు గైడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం నగర అధ్యక్షుడు అతిఫ్ అతినా, జనరల్ సెక్రెటరీ మోసిన్ మోహియుద్దీన్, జాయింట్ సెక్రటరీ అజర్ దబీర్, ఖమరుద్దీన్, బర్కత్ అలీ, ఖుర్షిద్, కార్పొరేటర్లు ఇబ్రహీం, మజీద్ హుస్సేన్, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎంఐఎం నాయకులు, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి వెలుగులు!

ఇప్పటికే పూర్తయిన 2,21,500 గృహప్రవేశాలు

పండుగ రోజు పేదల ఆనందంలో భాగస్వాములు కావాలి

అన్ని నగరాల్లోనూ ఐదంతస్తుల ఇందిరమ్మ భవనాలు

ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు

గోడపత్రిక ఆవిష్కరించిన మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

మేడ్చల్ మల్కాజ్‌గిరి, నవంబర్ 4 (సమయం న్యూస్) : రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇప్పటివరకు ఏకంగా 2,21,500 గృహప్రవేశాలు పూర్తయ్యాయని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ దీపావళి పండుగను ప్రతి ఇందిరమ్మ ఇంట్లో అత్యంత ఘనంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మాట్లాడారు. పండుగ రోజున పేదల ఇంట్లో వెలిగే ప్రతి దీపం ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కొత్త ఇళ్లల్లోకి వెళ్లిన వారి ఆనందంలో పాలుపంచుకునేందుకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఆయా ఇళ్లకు వెళ్లాలని కోరారు. దీనికి సూచికగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' అనే గోడపత్రికను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక అవరోధాలు ఉన్నప్పటికీ పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపేది లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు భద్రత, భరోసా కల్పించాలన్న సంకల్పంతో తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. అందులో ఇప్పటికే 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తవగా.. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ముగింపు దశకు చేరుకున్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.40 వేల కోట్లతో చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి నిధుల కొరత రానీయబోమన్నారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే అవినీతి రహితంగా నిధులు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. తొలి విడత 4.50 లక్షల ఇళ్లకు అదనంగా రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ నగర ప్రధాన ప్రాంతంలో లక్ష ఇళ్లను మంజూరు చేశామని మంత్రి చెప్పారు. స్థలాల కొరతను అధిగమించేందుకు హైదరాబాద్ నగర తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ నగరాల్లో కూడా ఐదంతస్తుల ఇందిరమ్మ భవన సముదాయాలు నిర్మిస్తామని ప్రకటించారు. ఈ నిర్మాణాలకు సంబంధించి దీపావళిలోగా అధికారిక ప్రకటన జారీ చేస్తామన్నారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లోని సముదాయాల నుంచి బోనాలు ఎత్తిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం నగరాలు, పట్టణాల్లోనే కాకుండా మారుమూల పల్లెలు, తండాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని.. దీంతో నిరుపేదల సొంతింటి కల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి హర్షం వ్యక్తం చేశారు.



గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పశుసంపదే మూలం!

హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్) : గ్రామీణ వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే పశుసంపదను గౌరవించి, వృద్ధి చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఉత్సవాలను ఇంత భారీ స్థాయిలో నిర్వహించిన సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్‌తో పాటు కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సదర్ ఉత్సవాల ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దీనికి రాష్ట్ర పండుగ హోదా కల్పించిందని భట్టి గుర్తుచేశారు. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ అధికారికంగా నిధులు ఇచ్చి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో పశుసంపద పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా పనిచేసిన అంజన్ కుమార్ యాదవ్.. ప్రజలతో మమేకమై ఈ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడం అభినందనీయమన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలు ఏటా మరింత వైభవంగా జరగాలని ఆయన ఆకాంక్షించారు.

ఏడాదిలో మళ్లీ కేసీఆర్ సర్కారే!

- అభివృద్ధిని చూసే నగర ప్రజలు మమ్మల్ని గెలిపించారు
- కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలకు పల్లెలు మోసపోయాయి
- మియాపూర్ భూములను అమరవీరులకు ఇవ్వాలి
- రాష్ట్రంలో పూర్తిగా పడిపోయిన స్థిరాస్తి వ్యాపారం
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్) : గత ఎన్నికల్లో నగర ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించి బీఆర్ఎస్‌కే పట్టం కట్టారని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. నగరంలో తాము చేసిన అభివృద్ధిని గుర్తించే ప్రజలు తమ అభ్యర్థులను గెలిపించారని పేర్కొన్నారు. ఔటర్ రింగు రోడ్డు అవతల కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి పల్లెల్లో ప్రజలు ఆ పార్టీకి ఓటు వేశారని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

అమరవీరులకు స్థలాలివ్వాలి..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మియాపూర్ ప్రభుత్వ భూముల వ్యవహారంలో బీఆర్ఎస్ పోరాటం వల్లే విజయం సాధించామన్నారు. ముఖ్యమంత్రికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే మియాపూర్ భూముల్లో తెలంగాణ అమరవీరులకు స్థలాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎర్రవల్లిలో కాకుండా నగరంలోనే వారికి స్థలాలు ఇస్తే తాము స్వాగతిస్తామని స్పష్టం చేశారు.

స్థిరాస్తి రంగం స్తంభన..

గత మూడేళ్లలో ఒక్క కొత్త ఇల్లు కూడా నిర్మించలేదని కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లో పెద్ద మొత్తంలో భూములను నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. దీంతో స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారం పూర్తిగా కుదేలైందని ఆరోపించారు. మరో ఏడాదిలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆక్రమణల్లో ఉన్న భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు.

అవినీతి ఊబిలో అధికారి!

తనిఖీల్లో 4.75 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

హైదరాబాద్, సూర్యాపేటలో 12 ఖాళీ స్థలాలు

ఫార్చ్యూనర్ సహా 73 లక్షల విలువైన కార్లు

భారీగా బంగారం, బ్యాంకు ఖాతాల్లో నగదు

ఏసీబీ వలలో మెప్మా అదనపు సంచాలకుడు



హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్) : పట్టణ పేదల సంక్షేమం కోసం పనిచేయాల్సిన మెప్మా విభాగంలో ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారం వెలుగుచూసింది. మెప్మా అదనపు సంచాలకుడు నల్లగట్ల యాదగిరిరావు నివాసాలు, కార్యాలయాలు, బంధువులు, బినామీలకు చెందిన ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఏకకాలంలో ముమ్మర సోదాలు నిర్వహించారు. రంగారెడ్డి రేంజ్‌కు చెందిన బృందాలు మొత్తం 10 చోట్ల తనిఖీలు చేపట్టి ప్రాథమికంగా 4.75 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను గుర్తించాయి. మార్కెట్ ధరల ప్రకారం వీటి విలువ మరింత భారీగా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సోదాల్లో హైదరాబాద్, సూర్యాపేట ప్రాంతాల్లో యాదగిరిరావు పేరిట ఉన్న 12 ఖాళీ స్థలాలను గుర్తించారు. వీటి విలువ 58.63 లక్షల రూపాయలుగా అంచనా వేశారు. ఉప్పల్‌లో 31.36 లక్షల విలువైన రెండు ఫ్లాట్లు, రెండు కోట్లకు పైగా విలువ చేసే మూడు అంతస్తుల భవనం, మేడపై ఓ గది (పెంట్‌హౌస్) బయటపడ్డాయి. సూర్యాపేటలో ఓ కాంక్రీట్ (ఆర్సీసీ) ఇల్లు, ఉప్పల్‌లో ఓ దుకాణం ఉన్నట్లు గుర్తించారు. అలాగే 1,792.2 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.80 లక్షల విలువైన మూడు కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టయోటా ఫార్చ్యూనర్‌తో పాటు మరో విలాసవంతమైన కారు విలువ 73 లక్షలుగా అంచనా వేశారు. ద్విచక్ర వాహనాలు, 29.08 లక్షల గృహోపకరణాలు, 7.01 లక్షల ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాంకు ఖాతాల్లో 32.30 లక్షల నగదును తనిఖీల్లో గుర్తించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు బ్యాంకు లాకర్లు, స్థిరాస్తుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మరిన్ని ఆస్తుల వివరాలు సేకరించే పనిలో పడ్డారు. నిందితుడు యాదగిరిరావును ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 ఉచిత నంబర్‌కు లేదా 9440446106 వాట్సాప్ నంబర్‌కు నేరుగా ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు ప్రజలకు సూచించారు.

ముంచెత్తిన 'మురసు'.. అన్నదాతకు కన్నీళ్లు!

- అశ్వారావుపేట మండలంలో విరుచుకుపడ్డ వానమ్మ
- చేతికొచ్చిన పంటలు వరద పాలు.. చేల్లో ఇసుక మేటలు
- ఉప్పొంగిన వాగులు.. కట్టలు తెంచుకున్న చెరువులు
- ఇళ్లలోకి చేరిన వరద.. జలదిగ్బంధంలో పలు గ్రామాలు
- తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వానికి రైతుల వేడుకోలు



అశ్వారావుపేట, నవంబర్ 4 (సమయం న్యూస్) : 'మురసు' తుఫాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర బీభత్సాన్ని సృష్టించింది. ముఖ్యంగా అశ్వారావుపేట మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలతో జనజీవనం పూర్తిగా అతలాకుతలమైంది. ఉప్పొంగిన వాగులు, వంకలతో పల్లెలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలు కోతకు వచ్చే సమయంలో ప్రకృతి విపత్తు రూపంలో విరుచుకుపడటంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి.

నీటిపాలైన రైతన్న కష్టం..

భీకర వర్షాలకు మండలంలోని అనేక గ్రామాల్లో వ్యవసాయ భూములు పూర్తిగా నీట మునిగిపోయాయి. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన వరి, మినుము, కంది, వేరుశెనగ పంటలు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. మరికొన్ని చోట్ల చేల్లోకి భారీగా ఇసుక మేటలు చేరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎటుచూసినా నిండుగా నిలిచిన వరద నీరే కనిపిస్తుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికే చేసిన అప్పులు భారంగా మారగా.. తాజా నష్టం తమను మరింత కుంగదీస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్తంభించిన రాకపోకలు..

వాగులు, చెరువులు పొంగిపొర్లుతుండటంతో పలు వంతెనల పైనుంచి ఉధృతంగా వరద ప్రవహిస్తోంది. దీంతో అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నీరు వెళ్లేందుకు సరైన మార్గాలు లేక రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అత్యవసర పనులపై బయటకు వెళ్లాల్సిన వారు సైతం మార్గమధ్యంలోనే నిలిచిపోవాల్సి వస్తోంది.

ఆదుకోవాలని వేడుకోలు..

ప్రకృతి ప్రకోపానికి సర్వస్వం కోల్పోయిన తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వరద బాధితులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నీట మునిగిన పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని, ఇళ్లలోకి నీరు చేరిన కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన తమకు నష్టపరిహారం అందించి అండగా నిలవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

సురక్షితంగా రక్షణ దళం!

ఖమ్మం, నవంబర్ 4 (సమయం న్యూస్) : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో భారీ వరద తీవ్ర ఉత్కంఠ రేపింది. వలలు వేసేందుకు వెళ్లి చిక్కుకున్న ఐదుగురు జాలర్లను కాపాడేందుకు వెళ్లిన అగ్నిమాపక, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పడవలు వరద ఉధృతికి బోల్తా పడ్డాయి. దీంతో ఆ రెండు పడవల్లో ఉన్న 11 మంది రక్షణ సిబ్బంది ఒక్కసారిగా గల్లంతయ్యారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే ఆరా తీశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న కలెక్టర్ దివాకర, ఎమ్మెల్యే రాగమయి సహాయక చర్యలు వేగవంతం చేశారు. భద్రాచలం నుంచి జాతీయ విపత్తు స్పందన దళాలను (ఎన్‌డీఆర్ఎఫ్) రప్పించారు. గాలింపులో వినియోగించే ఆధునిక పరికరాలతో (డ్రోన్లతో) బాధితులకు ప్రాణ రక్షణ కవచాలు పంపించారు. గల్లంతైన సిబ్బందితో పాటు జాలర్లు అందరూ సమీపంలో సురక్షితంగా ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో సర్వత్రా ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం మంత్రి పొంగులేటి ఈ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించనున్నారు.


రూ.400 కోట్ల సైబర్ వల!

అమెరికా పౌరులే లక్ష్యంగా అంతర్జాతీయ ముఠా

ఆన్‌లైన్ నిర్బంధం, పెట్టుబడుల పేరుతో దోపిడీ

నలుగురిని అరెస్టు చేసిన హైదరాబాద్ ఈడీ

హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్) : అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని ఏకంగా 400 కోట్లకు పైగా సైబర్ మోసాలకు పాల్పడిన అంతర్జాతీయ ముఠాకు చెందిన నలుగురు ప్రధాన నిందితులను హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. నకిలీ కాల్‌సెంటర్ల ద్వారా ఆన్‌లైన్ నిర్బంధం (డిజిటల్ అరెస్ట్) పేరుతో బెదిరింపులకు గురిచేయడంతో పాటు, వర్చువల్ కరెన్సీ (క్రిప్టో) పెట్టుబడుల పేరుతో ఈ ముఠా భారీగా మోసాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. పంజాబ్‌లోని పాటియాలాలో దాడులు నిర్వహించి ప్రధాన నిందితుడు హర్షల్ రావల్‌తో పాటు ప్రణవ్ పితాదియా, జశ్వంత్ సింగ్, చేతన్ ముంజల్‌లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పీటీ వారెంట్‌పై వారిని హైదరాబాద్‌కు తరలించి రిమాండ్‌కు పంపించారు. ఈడీ దర్యాప్తు ప్రకారం.. హర్షల్ రావల్ నేతృత్వంలోని ఈ ముఠా తొలుత హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఓ నకిలీ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి మోసాలకు తెరలేపింది. అక్కడ అధికారుల దాడుల అనంతరం తమ చీకటి కార్యకలాపాలను పంజాబ్‌లోని పాటియాలకు మార్చింది. గత మూడేళ్లుగా అక్కడి నుంచి అమెరికా పౌరులకు ఫోన్లు చేసి ఆన్‌లైన్ నిర్బంధం పేరుతో బెదిరింపులకు పాల్పడటంతో పాటు వర్చువల్ కరెన్సీలో పెట్టుబడుల ఆశ చూపి వేలాది మందిని నిలువునా మోసం చేసినట్లు అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు.



హవాలా మార్గంలో తరలింపు..

బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని ముందుగా వర్చువల్ కరెన్సీగా మార్చి, ఆ తర్వాత హవాలా మార్గాల్లో ఇతర ప్రాంతాలకు తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలను కప్పిపుచ్చేందుకు వందలాది బినామీ (మ్యూల్) బ్యాంకు ఖాతాలను వినియోగించినట్లు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంలో సుమారు రూ.400 కోట్ల మేర వర్చువల్ కరెన్సీ లావాదేవీలు జరిగినట్లు ఈడీ ప్రాథమికంగా అంచనా వేస్తోంది. కేసు దర్యాప్తులో భాగంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఏకకాలంలో ముమ్మర సోదాలు నిర్వహించిన అధికారులు.. ముఠా ఆర్థిక లావాదేవీలు, హవాలా ఏజెంట్లు, ఇతర సహ నిందితుల పాత్రపై తీవ్రంగా దృష్టి సారించారు. అరెస్టయిన ఈ నలుగురు నిందితులను తమ కస్టడీలోకి తీసుకుని మరింత లోతుగా వివరాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ఓటమి భయంతోనే సంస్థలపై నిందలు!

- కాంగ్రెస్ నేతల పచ్చి అబద్ధాలను తిప్పికొట్టాలి
- జాబితా సవరణ అనేది ఈ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదు
- ఇరవై ఏళ్ల తర్వాత జాబితా ప్రక్షాళన చేపట్టిన ఎన్నికల సంఘం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆగ్రహం

వికారాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్): ఎన్నికల్లో వరుస ఓటములను తట్టుకోలేక కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రజాస్వామ్య సంస్థలపై విషం చిమ్ముతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ పట్టణంలో ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియపై బుధవారం నిర్వహించిన మేధావులు, న్యాయవాదుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'ఓట్ల చోరీ' అంటూ ఎన్నికల సంఘంపైనా, కేంద్ర ప్రభుత్వంపైనా ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధార ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఈ ప్రభుత్వంలో కొత్తగా తెచ్చినది కాదని, గతంలో రాజీవ్ గాంధీ లాంటి కాంగ్రెస్ ప్రధానుల కాలంలోనే పలుమార్లు జరిగిందని ఆయన గుర్తుచేశారు.

అవన్నీ తప్పుడు ఆరోపణలే..

సుమారు ఇరవై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధ బాధ్యతగా ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టిందని రామచందర్ రావు తెలిపారు. 13 కోట్ల ఓట్లు రాత్రికి రాత్రే తొలగించేశారంటూ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయి విచారణ పూర్తయిన తర్వాతే తుది జాబితా వస్తుందని స్పష్టం చేశారు. "జాబితాలో 6.3 కోట్ల మంది వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు, మూడు కోట్ల మంది చిరునామాల్లో అందుబాటులో లేనివారు, 2.8 కోట్ల మంది మరణించినవారు, కోటి మందికి పైగా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు ఉన్నారు. గత ఇరవై ఏళ్లలో మరణించిన వారి పేర్లను, అక్రమ ఓట్లను తొలగించకుండా అలాగే ఉంచాలా?" అని రామచందర్ రావు కాంగ్రెస్ నేతలను నిలదీశారు. దొంగ ఓట్లతో అధికారంలోకి రావాలనుకునే ఆ పార్టీ కుట్రలకు గండిపడుతుందనే ఈ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

అధికారులందరూ రాష్ట్ర ప్రభుత్వానివే..

సర్వే ప్రక్రియలో కేంద్రం ప్రమేయం ఏమీ ఉండదని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్యోగులే ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ అన్ని పార్టీల ఏజెంట్లు పర్యవేక్షిస్తున్నారని, ఎవరి పేరైనా పొరపాటున తొలగిస్తే దరఖాస్తు ద్వారా తిరిగి నమోదు చేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందని స్పష్టం చేశారు. దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వం రాజీపడబోదని, పౌరసత్వం లేని చొరబాటుదారులను ఓటర్ల జాబితా నుంచి కచ్చితంగా తొలగిస్తుందని తేల్చిచెప్పారు. ప్రజలు తమను విశ్వసించకపోవడంతోనే కాంగ్రెస్ పార్టీ యంత్రాలపై, న్యాయస్థానాలు, ఎన్నికల సంఘంపై నిందలు మోపుతోందని రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రైతు గర్జన స్ఫూర్తితో పోరాడాలి!

బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, నవంబర్ 4 (సమయం న్యూస్) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ చేపట్టిన 'రైతు గర్జన' విజయవంతం కావడం పట్ల పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ప్రజాక్షేత్రంలో నిరంతర పోరాటం కొనసాగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, నేతలు భార్గవ్ దేశ్‌పాండే, జోగు మహేందర్ తదితరులు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతు గర్జన వివరాలను వారు ఆయనకు వివరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, సాగునీటితో రైతాంగానికి ఎంతో భరోసా కల్పించామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయా పథకాల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. ఇదే వేదికపై వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు.





కుప్పకూలిన కాన్సస్ కంచుకోట

అమెరికాలో డెమోక్రాట్ల ప్రభంజనం!

- 94 ఏళ్ల తర్వాత రిపబ్లికన్ల కోటలో చారిత్రాత్మక విజయం
- ట్రంప్‌కు మధ్యంతర ఎన్నికల్లో భారీ రాజకీయ ఎదురుదెబ్బ
- సెనెట్, ప్రతినిధుల సభ రెండింటిపైనా డెమోక్రాట్ల పట్టు
- కాన్సస్‌లో రోజర్ మార్షల్‌ను ఓడించిన ఆడమ్ హమిల్టన్
- వాషింగ్టన్ మేయర్‌గా జనీస్ లూయిస్ జార్జ్ విజయం
- అమెరికా తొలి ముస్లిం సెనెటర్‌గా అబ్దుల్ ఎల్ సయెద్ చరిత్ర

వాషింగ్టన్, నవంబర్ 4 : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఓటర్లు గట్టి ఎదురుదెబ్బ ఇచ్చారు. దశాబ్దాలుగా రిపబ్లికన్లకు పట్టున్న రాష్ట్రాల్లోనూ డెమోక్రటిక్ పార్టీ అనూహ్య విజయాలు సాధించింది. అమెరికా కాంగ్రెస్‌లోని సెనెట్, ప్రతినిధుల సభ రెండింటిపైనా డెమోక్రాట్లు నియంత్రణ సాధించారు. ముఖ్యంగా రిపబ్లికన్ల కంచుకోటగా పేరొందిన కాన్సస్‌లో 94 ఏళ్ల తర్వాత డెమోక్రటిక్ పార్టీ సెనెట్ స్థానాన్ని గెలుచుకోవడం ఈ ఎన్నికల్లో అత్యంత కీలక పరిణామంగా నిలిచింది. మరోవైపు మిషిగన్ నుంచి అబ్దుల్ ఎల్ సయెద్ అమెరికా చరిత్రలో తొలి ముస్లిం సెనెటర్‌గా ఎన్నికై సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. కాన్సస్ రాష్ట్రంలో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి ఆడమ్ హమిల్టన్ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు. ప్రస్తుత రిపబ్లికన్ సెనెటర్ రోజర్ మార్షల్‌ను ఓడించి రాజకీయ సంచలనం సృష్టించారు. 1932 తర్వాత కాన్సస్ నుంచి అమెరికా సెనెట్‌కు ఎన్నికైన తొలి డెమోక్రటిక్ అభ్యర్థిగా హమిల్టన్ నిలిచారు. దాదాపు తొమ్మిది దశాబ్దాలకు పైగా కొనసాగిన రిపబ్లికన్ల ఆధిపత్యానికి ఈ ఫలితం ముగింపు పలికింది. తాజా ఫలితాల ప్రకారం హమిల్టన్ సుమారు 50.9 శాతం ఓట్లు సాధించగా, రోజర్ మార్షల్‌కు సుమారు 46.1 శాతం ఓట్లు లభించాయి. రిపబ్లికన్లకు సంప్రదాయంగా బలమైన మద్దతు ఉన్న రాష్ట్రంలో డెమోక్రాట్ల విజయం జాతీయ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది.



కాంగ్రెస్‌లో మారిన బలాబలాలు

అమెరికా ప్రతినిధుల సభలో మెజార్టీకి అవసరమైన 218 స్థానాల మార్కును డెమోక్రాట్లు అధిగమించారు. సెనెట్‌లోనూ కీలక స్థానాలను రిపబ్లికన్ల నుంచి కైవసం చేసుకుని ఆధిపత్యం సాధించారు. దీంతో అధ్యక్షుడు ట్రంప్ మిగిలిన పదవీకాలంలో చట్టసభల నుంచి మరింత రాజకీయ ప్రతిఘటన ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. జీవన వ్యయం పెరుగుదల, ఆర్థిక విధానాలు, విదేశాంగ నిర్ణయాలు వంటి అంశాలపై ఓటర్ల అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థల విశ్లేషణలు పేర్కొన్నాయి. రిపబ్లికన్లకు బలమైన పట్టున్న పలు రాష్ట్రాల్లో డెమోక్రాట్లు విజయాలు సాధించడం ఆ పార్టీకి మరింత ఉత్సాహాన్నిచ్చింది.

వాషింగ్టన్ మేయర్‌గా జనీస్ లూయిస్ జార్జ్

అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ మేయర్ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి చెందిన జనీస్ లూయిస్ జార్జ్ విజయం సాధించారు. ప్రజలకు అందుబాటులో ఉండే గృహవసతి, రవాణా సదుపాయాల విస్తరణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని ఆమె ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ ప్రతిపాదించిన కొన్ని ప్రగతిశీల విధానాలతో ఆమె ప్రచార హామీలకు పోలికలు ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరిగింది. వాషింగ్టన్ డీసీలో ప్రజాస్వామ్య సోషలిస్టు భావజాలానికి చెందిన నాయకురాలు మేయర్‌గా ఎన్నిక కావడం కూడా ఈ ఎన్నికల్లో ప్రత్యేక పరిణామంగా నిలిచింది.

తొలి ముస్లిం సెనెటర్‌గా అబ్దుల్ ఎల్ సయెద్

మిషిగన్ రాష్ట్రంలో మరో చారిత్రాత్మక ఫలితం నమోదైంది. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి అబ్దుల్ ఎల్ సయెద్ రిపబ్లికన్ అభ్యర్థి మైక్ రోజర్స్‌ను ఓడించి అమెరికా సెనెట్‌కు ఎన్నికయ్యారు. దీంతో అమెరికా చరిత్రలో తొలి ముస్లిం సెనెటర్‌గా ఆయన గుర్తింపు పొందారు. ప్రజారోగ్య రంగంలో పనిచేసిన అనుభవం ఉన్న ఎల్ సయెద్ ఎన్నికల ప్రచారంలో ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక అసమానతలు, ప్రజా సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన విజయం అమెరికా రాజకీయాల్లో మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించి చారిత్రాత్మక పరిణామంగా నిలిచింది.

ట్రంప్ ముందున్న కొత్త సవాళ్లు

మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయంతో అమెరికా రాజకీయాల్లో అధికార సమతుల్యత మారింది. కాంగ్రెస్ ఉభయ సభల్లో ప్రతిపక్షానికి ఆధిపత్యం లభించడంతో ప్రభుత్వ చట్టప్రతిపాదనలు, కీలక నియామకాలు, పరిపాలనా నిర్ణయాలపై మరింత పరిశీలన జరిగే అవకాశముంది. ముఖ్యంగా కాన్సస్ వంటి రిపబ్లికన్ల సంప్రదాయ కంచుకోటల్లో ఓటర్ల తీర్పు మారడం 2028 అధ్యక్ష ఎన్నికలకు ముందు రెండు ప్రధాన పార్టీల రాజకీయ వ్యూహాలపై ప్రభావం చూపనుంది.

హర్మూజ్‌లో భారత్‌కు ప్రత్యేక మినహాయింపు!

- భారత నౌకల రాకపోకలకు ఆంక్షల నుంచి ఉపశమనం
- చైనా, ఇరాక్, ఖతార్‌లకూ ప్రత్యేక అనుమతులు
- భారత్ నుంచి ఔషధాల దిగుమతుల కోసమే నిర్ణయమన్న ఇరాన్



టెహ్రాన్, నవంబర్ 4 (ఉద్యమ కెరటం): పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో భారత్‌కు ప్రత్యేక మినహాయింపు ఇస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. భారత్‌తోపాటు చైనా, ఇరాక్, ఖతార్ దేశాలకు చెందిన వాణిజ్య నౌకలను ఆంక్షల నుంచి మినహాయిస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ విధాన కమిటీ ఉపాధ్యక్షుడు అమీర్ హయత్ వెల్లడించారు. ఇతర దేశాల నౌకలపై కొనసాగుతున్న ఆంక్షలు ఈ 4దేశాలకు వర్తించవని తెలిపారు. ఇరాన్ దౌత్య, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా భారత్ నుంచి ఔషధాల దిగుమతులను సులభతరం చేయడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిలో నౌకాయానంపై ఆంక్షలు కొనసాగుతున్నప్పటికీ తమతో స్నేహపూర్వక సంబంధాలు కలిగిన దేశాలకు ప్రత్యేక సడలింపులు కల్పిస్తున్నట్లు అమీర్ హయత్ తెలిపారు. భారత్, చైనా, ఇరాక్, ఖతార్ దేశాల నౌకలు ఆంక్షలు లేకుండా జలసంధి గుండా ప్రయాణించేందుకు అనుమతిస్తున్నట్లు చెప్పారు. ఈ దేశాల నౌకల రాకపోకలకు అమెరికా కూడా అడ్డంకులు సృష్టించబోదని ఆయన పేర్కొన్నారు. అయితే ఇది ఇరాన్ ప్రతినిధి చేసిన ప్రకటన మాత్రమే కాగా, అమెరికా వైఖరిపై స్వతంత్ర ధ్రువీకరణ అవసరం. భారత్‌కు ప్రత్యేక మినహాయింపు ఇవ్వడానికి ప్రధాన కారణం ఔషధాల దిగుమతులేనని అమీర్ హయత్ వివరించారు. భారత ఔషధ పరిశ్రమ నుంచి ఇరాన్‌కు అవసరమైన మందులు, వైద్య సంబంధిత ఉత్పత్తుల సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. సముద్ర రవాణాపై ఆంక్షల కారణంగా ఔషధాల సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్న ఉద్దేశంతో భారత నౌకలకు సడలింపులు కల్పించినట్లు తెలిపారు. చైనాకు మినహాయింపు ఇవ్వడం వెనుక దౌత్యపరమైన ప్రయోజనాలు ఉన్నాయని ఇరాన్ ప్రతినిధి వెల్లడించారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చైనా నుంచి రాజకీయ మద్దతు పొందేందుకు ఈ చర్య ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇరాక్, ఖతార్‌తో ఉన్న సంబంధాలను దృష్టిలో ఉంచుకుని నౌకల రాకపోకలకు అనుమతులు కల్పించినట్లు తెలిపారు. ఈ నిర్ణయాలన్నీ ఇరాన్ ఆర్థిక, దౌత్య ప్రయోజనాలకు అనుగుణంగా తీసుకున్నవేనని స్పష్టం చేశారు. నాలుగు దేశాల నౌకలకు రవాణా ఆంక్షల నుంచి మినహాయింపు కల్పించినప్పటికీ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి రవాణా రుసుము వసూలు చేస్తామని అమీర్ హయత్ తెలిపారు. మినహాయింపు అనేది నౌకల రాకపోకలకు సంబంధించినదేనని, రుసుముల చెల్లింపునకు వర్తించదని ఆయన ప్రకటన ద్వారా స్పష్టమవుతోంది. అయితే రుసుము ఎంత ఉంటుందన్నది, దాన్ని ఏ విధంగా వసూలు చేస్తారన్నది వెల్లడించలేదు. పర్షియన్ గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్‌తో అనుసంధానించే హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత ప్రాధాన్యం కలిగిన సముద్ర మార్గం. గల్ఫ్ దేశాల నుంచి అంతర్జాతీయ మార్కెట్లకు తరలించే ముడిచమురు, సహజవాయువు రవాణాలో ఈ మార్గం కీలక పాత్ర పోషిస్తుంది. ఇక్కడ నౌకాయానానికి అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ చమురు ధరలు, సరఫరా వ్యవస్థలపై ప్రభావం పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో భారత నౌకలకు ప్రత్యేక మినహాయింపు ఇస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ సడలింపుల అమలు విధానం, నౌకల భద్రత, ఇతర దేశాల స్పందనపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.



ఫాం 6 ద్వారా మళ్లీ ఓటరుగా నమోదు కండి

ప్రధాన ఎన్నికల సంఘం స్పష్టం!

న్యూఢిల్లీ, నవంబర్ 4 : ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ అనంతరం ప్రచురించిన ఓటరు జాబితాలో పేర్లు గల్లంతైన పౌరులు ఏమాత్రం ఆందోళన చెందకుండా 'ఫాం 6' ద్వారా మళ్లీ ఓటరుగా నమోదు కావచ్చని భారత ప్రధాన ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. గతంలో ఓటు హక్కు కలిగి ఉండి, ఈ సవరణల తర్వాత జాబితాలో పేరు కోల్పోయిన వారు కూడా ఎలాంటి అపోహలు లేకుండా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులకు నవంబర్ 3న ప్రత్యేక మార్గదర్శక లేఖను పంపించింది. ఓటరు జాబితా ప్రత్యేక సవరణల తర్వాత దేశ వ్యాప్తంగా పలువురు పాత ఓటర్ల పేర్లు తొలగింపునకు గురికావడంతో గందరగోళం నెలకొంది. గతంలోనే ఓటరుగా ఉన్న తాము ఇప్పుడు మళ్లీ ఫాం 6 సమర్పిస్తే, తొలిసారి నమోదు చేసుకుంటున్నట్లు తప్పుడు ప్రకటన (డిక్లరేషన్) ఇచ్చినట్లు అవుతుందేమోనని, చట్టపరమైన చిక్కులు ఎదురవుతాయేమోనని భావించి అనేకమంది దరఖాస్తుకు వెనుకంజ వేస్తున్నారు. ఈ సందేహాలపై ప్రధాన ఎన్నికల సంఘం స్పందిస్తూ.. ఫాం 6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన దానిని తప్పుడు డిక్లరేషన్‌గా చూడబోమని, దరఖాస్తుదారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు ఉండవని హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే అర్హులైన పాత ఓటర్లు కొత్తగా ఫాం 6 సమర్పించినప్పుడు వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 31 కింద ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఎన్నికల అధికారులకు సర్వోన్నత ఎన్నికల సంస్థ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కాకపోతే, సదరు దరఖాస్తుదారులు దేశంలోని మరే ఇతర అసెంబ్లీ లేదా పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదై ఉండకూడదని షరతు విధించింది. ఓటరు జాబితాలో పేరు లేని అర్హులందరూ తక్షణమే ఫాం 6 ద్వారా మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈసీ పిలుపునిచ్చింది.

అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్

అగ్నిపథ్ సర్వీస్ కాలం మరో రెండేళ్లు పెంపు!



న్యూఢిల్లీ, నవంబర్ 4 : సాయుధ దళాల్లో సేవలు అందిస్తున్న అగ్నివీర్‌లకు కేంద్ర ప్రభుత్వం గొప్ప ఉపశమనం కలిగిస్తూ తీపి కబురు అందించింది. అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్‌ల సర్వీస్ కాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సంచలన విషయాన్ని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎన్. రాజా సుబ్రమణి బుధవారం అధికారికంగా వెల్లడించారు. సాధారణంగా అగ్నిపథ్ నిబంధనల ప్రకారం అగ్నివీర్‌లకు నాలుగేళ్ల సర్వీస్ కాలం మాత్రమే ఉంటుంది. ఈ వ్యవధి పూర్తయిన తర్వాత వారిలోని 25 శాతం మంది అత్యుత్తమ ప్రతిభావంతులను త్రివిధ దళాల (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) శాశ్వత కేడర్‌కు ఎంపిక చేస్తారు. అయితే శాశ్వత కేడర్‌కు ఎంపిక కాకుండా మిగిలిపోయే 75 శాతం మంది అగ్నివీర్‌ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారి సర్వీస్ కాలాన్ని నాలుగేళ్ల నుంచి ఆరేళ్లకు కేంద్రం పొడిగించింది. ఈ రెండేళ్ల పొడిగింపు నిర్ణయం వల్ల ఆ 75 శాతం మంది అగ్నివీర్‌లకు శాశ్వత కేడర్‌లో చేరడానికి మరొక అదనపు అవకాశం లభించనుంది. 2022లో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం అత్యంత అద్భుతమైన ఫలితాలను అందించిందని సీడీఎస్ సుబ్రమణి కొనియాడారు. కాగా, సాయుధ దళాల్లో చేరిన మొదటి బ్యాచ్ నౌకాదళ (నేవీ) అగ్నివీర్‌ల సర్వీస్ కాలం నవంబరు 21తో, వైమానిక దళ (ఎయిర్‌ఫోర్స్) అగ్నివీర్‌ల మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం డిసెంబరు 21తో, థలసేన (ఆర్మీ) మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం డిసెంబరు 31తో ముగియనుంది. నాలుగేళ్ల క్రితం ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలలో మొదటి విడత కింద మొత్తం 24,400 మంది అగ్నివీర్‌లుగా విధుల లోకి చేరారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు గడిచిన నాలుగేళ్ల కాలంలో సైన్యంలో సుమారు 2,70,000 మంది, వాయుసేనలో 27,000 మంది, నేవీలో 21,000 మంది అగ్నివీర్‌లుగా నియామకమయ్యారు. అగ్నిపథ్ సర్వీస్ కాలంలో సైనిక శిక్షణ, ఫిట్‌నెస్‌పైనే కాకుండా అగ్నివీర్‌లలో నైతిక విలువలు, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని సీడీఎస్ జనరల్ ఎన్.ఎన్. రాజా సుబ్రమణి తెలిపారు.

ఎన్నికల కమిషనర్లు చట్టానికి అతీతులా?

- జీవితకాల చట్టపరమైన రక్షణపై సుప్రీంకోర్టులో కీలక విచారణ
- రాజ్యాంగంలోని 14, 21వ అధికరణాలకు విరుద్ధమని వాదన
- కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు
- డిసెంబర్ 18కి విచారణ వాయిదా



న్యూఢిల్లీ, నవంబర్ 4 : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనను సవాలు చేస్తూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై కీలక విచారణ జరిగింది. 2023 నాటి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలోని 'సెక్షన్ 16' రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ పిటిషనర్ అరుణ్ కుమార్ అగర్వాల్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్'లోని సెక్షన్ 16 ఇప్పుడు తీవ్ర వివాదానికి కారణమైంది. ఈ నిబంధన ప్రకారం సీఈసీ లేదా ఎన్నికల కమిషనర్ అధికారిక విధుల నిర్వహణలో చేసిన లేదా మాట్లాడిన విషయాలపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసులను కూడా ముందుకు తీసుకెళ్లకూడదు. పదవిలో ఉన్నప్పుడే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా ఈ రక్షణ వర్తిస్తుంది. ఈ నిబంధన ఎన్నికల కమిషనర్లకు అవసరానికి మించిన రక్షణ కల్పిస్తోందని, అధికారిక విధుల పేరుతో తప్పులు చేసినా, దురుద్దేశంతో వ్యవహరించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది రాజ్యాంగంలోని 14 (సమానత్వ హక్కు), 21 (జీవించే హక్కు) అధికరణలతో పాటు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని పిటిషనర్లు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తమ సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది. ఓటరు జాబితా నుంచి తప్పుగా పేరు తొలగించినా, అభ్యర్థికి అన్యాయం జరిగినా, ఎన్నికల సంఘంలో అవినీతి జరిగినా బాధితులకు న్యాయపరమైన పరిష్కారం లేకుండా పోతుందని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. తాలుత 2023 బిల్లులో ఈ సంపూర్ణ రక్షణ నిబంధన లేదని, అనంతరం సవరణ ద్వారా సెక్షన్ 16ను చేర్చారని, ప్రతిపక్ష ఎంపీలు పెద్ద సంఖ్యలో సస్పెన్షన్‌లో ఉన్న సమయంలో పార్లమెంట్ దీనికి ఆమోదం తెలిపిందని పిటిషనర్ పేర్కొన్నారు.

కుషాయిగూడ బస్‌స్టాప్ పరిరక్షణకు ఐక్య పోరాటం

- **బారికేడ్లు తొలగించకపోతే నవంబర్ 15న భారీ ధర్నా.. దుకాణాల బంద్‌కు పిలుపు**

కుషాయిగూడ, సమయం



కుషాయిగూడ బస్‌స్టాప్ పరిరక్షణ కోసం స్థానిక కాలనీల ప్రజలు, వ్యాపారులు ఐక్యంగా ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. బస్‌స్టాప్ వద్ద ఉన్న షెల్టర్‌ను, కుర్చీలను మార్కెట్ వైపు వెనక్కి జరిపేందుకు జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ప్రయత్నాలను స్థానికులు అడ్డుకున్నారు. బస్‌స్టాప్‌ను యథావిధిగా కొన సాగించాలని అధికారులతో చర్చించి, షెల్టర్‌ను తరలించే ప్రయత్నాన్ని నిలిపివేయించారు. అదే సమయంలో బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న పూల దుకాణాలను కూడా వెనక్కి జరిపించారు.కుషాయిగూడ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బారికేడ్లను తొలగించాలని స్థానికులు ట్రాఫిక్ సీఐని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, ఉన్నతాధికారులతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.నవంబర్ 10లోగా బారికేడ్లు తొలగించాలిదీపావళి అనంతరం నవంబర్ 10వ తేదీలోగా కుషాయిగూడలోని ట్రాఫిక్ బారికేడ్లను తొలగించకపోతే రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమం చేపడతామని స్థానిక కాలనీల ప్రతినిధులు హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులను కలుపుకొని నవంబర్ 15, ఆదివారం కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ధర్నాకు మద్దతుగా ఒకరోజు వ్యాపార సంస్థలను బంద్ చేసి, బారికేడ్ల తొలగింపునకు అధికారులపై ఒత్తిడి తీసుకురానున్నట్లు వెల్లడించారు.కుషాయిగూడ బస్‌స్టాప్ పరిసర ప్రాంతాల్లోని 25 నుంచి 30 కాలనీల ప్రజలకు రవాణా పరంగా ఎంతో కీలకమని, దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ కాలనీల ఐక్యవేదిక నాయకులు పనగట్ల చక్రపాణి, చల్ల ప్రభాకర్, గణేష్ ముదిరాజ్, పంజాల బాబు గౌడ్, కొడకండ్ల యాదయ్య, బింగి భిక్షపతి గౌడ్, సల్ల వెంకటేష్, జైకృష్ణ, హరిలాల్ నాయక్, పిట్ల రాజు ముదిరాజ్, నలచెరువుల జనార్దన్, దయానంద్, సుధాకర్, రమేష్ చౌదరి, పులి నరేందర్, గోపి, సంపత్, ధీరావత్ బాలాజీ నాయక్, మనోహర్, కాసుల నందం గౌడ్, అనిల్ యాదవ్, వెంకటేష్, అనిల్, వినయ్, నీల రాజేష్, రాజు, దిలీప్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా వ్యవస్థపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ పరిశీ

సిద్దిపేట, నవంబర్ 4(సమయం న్యూస్,)



మిషన్ భగీరథ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు నిరంతరంగా, నాణ్యమైన తాగునీరు అందేలా అధికారులు పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణ పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఐఏఎస్ ఆదేశించారు.బుధవారం కుకునూరుపల్లి మండలం మంగోలు గ్రామ శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫిల్టర్ హౌస్, ల్యాబ్, 75 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన క్లియర్ వాటర్ రిజర్వాయర్‌ను పరిశీలించి నీటి శుద్ధి, నిల్వ, పంపింగ్ వ్యవస్థపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా వివిధ గ్రామాలకు జరుగుతున్న తాగునీటి సరఫరా, పైపులైన్ల పనితీరు, గ్రిడ్ నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రామీణ ప్రజలకు ప్రతిరోజూ సరిపడా, నాణ్యమైన శుద్ధమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న నవీన్ మిట్టల్.. సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం గ్రామంలో మల్లన్నసాగర్-తిప్పారం వాటర్ పంప్ హౌస్‌ను కూడా ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, సీఈ ఎస్ఈలు వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.క్లుప్త వార్త: మిషన్ భగీరథ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు నిరంతర, నాణ్యమైన తాగునీరు అందేలా పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. కుకునూరుపల్లి మండలం మంగోలు, తిప్పారం గ్రామాల్లోని నీటి శుద్ధి, నిల్వ, పంపింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

కోస్గిలో సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలి

- **రెండు రోజుల్లో అన్ని పనులు పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రియాంక**

కోస్గి మున్సిపల్, నవంబర్,04(సమయం న్యూస్)



నారాయణ పేట జిల్లాలోని కోస్గి పట్టణంలో రూ.5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సర్ సీ.వీ. రామన్ సైన్స్ మ్యూజియాన్ని అన్ని హంగులతో త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోస్గి పట్టణంలోని సర్ సీ.వీ. రామన్ సైన్స్ మ్యూజియాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మ్యూజియంలో విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల సైన్స్ పరికరాలను, వాటి అమరిక పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మ్యూజియంలో సైన్స్ పరికరాల ఏర్పాటు, ఇతర మిగిలిన పనులన్నింటినీ మరో రెండు రోజుల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు.మ్యూజియంలో ఏర్పాటు చేస్తున్న సైన్స్ పరికరాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులుకు సూచించారు. పరికరాలను ఎలాంటి రక్షణ లేకుండా బహిరంగంగా ఏర్పాటు చేయకుండా, వాటి పరిరక్షణ కోసం తగిన విధంగా చిన్న గాజు పలకలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు పరికరాలను సులభంగా పరిశీలించే లా, వాటికి ఎలాంటి నష్టం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతి సైన్స్ పరికరం వెనుక భాగంలో దాని పేరు, ఉపయోగం, పనితీరు, శాస్త్రీయ సూత్రాలను వివరించేలా పెద్ద సైజు సమాచార చార్టులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. దీనివల్ల విద్యార్థులు సంబంధిత పరికరాన్ని పరిశీలిస్తూనే దాని పనితీరును చదివి అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సైన్స్ పరికరాలకు సంబంధించిన సమాచారం సరళమైన భాషలో, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండాలని పేర్కొన్నారు.అలాగే మ్యూజియం ఆవరణలో పరిశుభ్రతను పాటిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరీని ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటి పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మ్యూజియాన్ని సందర్శించినప్పుడు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగేలా పరిసరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.మ్యూజియం ప్రారంభమైన అనంతరం పరికరాల పనితీరును విద్యార్థులకు వివరించేందుకు ప్రత్యేకంగా ఒక సైన్స్ అధికారిని నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. మ్యూజియాన్ని సందర్శించే విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు, పరికరాల వినియోగం, శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పించే విధంగా అవసరమైన సిబ్బంది, నిర్వహణ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.మ్యూజియంలో అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, నిర్దేశించిన గడువులోగా మ్యూజియాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగుల పల్లి నరేందర్, ప్రజారోగ్య శాఖ ఎస్.ఈ. విజయ్ భాస్కర్, హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియం డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ కళ్యాణి, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల ఏఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభిమానమే అండ.. ఆత్మీయతే ఆలంబన..

- **దివ్యాంగుల సేవలోనే మానవత్వానికి నిజమైన చిరునామా**
- **వైకల్యం శరీరానికే.. ప్రతిభకు కాదు... డా. అనితా రెడ్డి**

హన్మకొండ, నవంబర్ 4 (సమయం న్యూస్) :



దివ్యాంగుల పట్ల ప్రేమ, ఆత్మీయత చూపుతూ వారి హక్కులను కాపాడినప్పుడే నిజమైన సేవ చేసినట్లవుతుందని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. మానసిక దివ్యాంగులకు మందు కంటే ప్రేమ, ఆత్మీయతే ఎంతో అవసరమని పేర్కొన్నారు. హన్మకొండ జిల్లా రాంపూర్‌లోని జీవధార ఆవరణలో ఫాదర్ జెరోమ్ అధ్వర్యంలో నిర్వహించిన "దివ్యాంగులకు ఆత్మీయ స్పర్శ - సాంస్కృతిక సమ్మేళనం" కార్యక్రమానికి డాక్టర్ అనితా రెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, ఆలపించిన పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయని అన్నారు. దివ్యాంగత్వం శరీరానికే కానీ ప్రతిభకు కాదని చిన్నారులు తమ ప్రదర్శనలతో నిరూపించారని ప్రశంసించారు.జిల్లాలోని వివిధ దివ్యాంగుల ఆశ్రమాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారిలో ఐక్యతను పెంపొందించడం అభినందనీయమన్నారు. చిన్నారులకు ఆత్మీయ స్పర్శను అందిస్తూ, వారి ప్రతిభను వెలికితీసి, సమాజంలో తామూ అందరిలాంటి వారమేనన్న భావన కల్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. వారందరికీ కడుపు నిండా భోజనం అందించి, ప్రేమతో అక్కున చేర్చుకున్న ఫాదర్ జెరోమ్ సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.దివ్యాంగులకు సమాజంలో ఇతరులతో సమానంగా అన్ని హక్కులు ఉంటాయని, ప్రతి ఒక్కరూ వారిని గౌరవిస్తూ తమకు తోచిన సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ అనితా రెడ్డి పిలుపునిచ్చారు. దివ్యాంగుల పట్ల చూపే ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయతే వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, ఫాదర్స్, సిస్టర్స్, తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు పోరాటాలను కొనసాగించాలి

- **దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసం ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి: ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి**

ఆలేరు, నవంబర్ 04(సమయం న్యూస్):



విప్లవ ప్రజా, రైతాంగ ఉద్యమాల్లో నేలకొరిగిన అమరవీరులను స్మరించుకోవడమంటే వారు ఎంచుకున్న పోరాట మార్గాన్ని సజీవంగా నిలపడమేనని, పీడిత ప్రజల విముక్తి కోసం వారి ఆశయాల సాధన దిశగా ఉద్యమాలను కొనసాగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సాదువెల్లి గ్రామంలో నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి ఇంజ శ్రీను పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజల కోసం పోరాడి అమరులైన విప్లవ యోధులకు నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థను నిర్మూలించి, దున్నేవారికే భూమి అనే వ్యవసాయ విప్లవ లక్ష్యంతో నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కోసం కమ్యూనిస్టు విప్లవకారులు విశేష కృషి చేశారని తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు, గిరిజన ప్రజలను ఉద్యమాల్లో భాగస్వాములను చేసి, ప్రజా పోరాటాల్లో వీరోచిత పాత్ర పోషించారని పేర్కొన్నారు. 1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పాలన సమయంలో నాటి వెంగళరావు ప్రభుత్వ హయాంలో బూటకపు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయిన విప్లవకారుల త్యాగాలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.కేంద్రంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశ సంపదను కొద్దిమంది చేతుల్లోకి వెళ్లేలా చేస్తోందని విమర్శించారు. ప్రజలకు చెందాల్సిన సహజ వనరులు, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తోందని ఆరోపించారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చారు మజుందార్, చండ్ర పుల్లారెడ్డి, పొట్ల రామనర్సయ్య, పైలా విక్రమన్న విప్లవ నాయకుల పోరాటాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వారి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా పోరాటాల్లో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జిల్లా నాయకులు కల్లెపు అడివయ్య వెంకటనర్సు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తతే అసలైన రక్షణ

- **వయోవృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి: ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్, నవంబర్ 4:(సమయం న్యూస్)

సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగ్రత్త దివాస్‌లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని ప్రణామం కేంద్రంలో వయోవృద్ధులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.తెలియని లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ యాప్‌లు, మోసపూరిత ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని ఎస్పీ సూచించారు. బ్యాంకు వివరాలు, ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరికీ వెల్లడించరాదన్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌లో ఆకర్షణీయమైన డిస్కౌంట్ల పేరుతో వచ్చే లింకులకు దూరంగా ఉండాలని, నమ్మకమైన అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌లను మాత్రమే వినియోగించాలని తెలిపారు. యూపీఐ ద్వారా డబ్బులు పొందేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, www.cybercrime.gov.in ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.అనంతరం ప్రణామం కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ వయోవృద్ధులతో కాసేపు చెస్, క్యారం ఆడి వారిని ఉత్సాహ పరిచారు. పోలీసు శాఖ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, వయోవృద్ధుల సంక్షేమ అధికారి మిల్కా, వయోవృద్ధుల సంఘం అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

100 రోజుల ప్రత్యేక కార్యాచరణ

- **విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు 100 రోజుల కార్యాచరణ**

పెద్దపల్లి, నవంబర్ 4(సమయం న్యూస్,,)

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జూలపల్లిలో ఉపాధ్యాయుల ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, భాషా నైపుణ్యాలు, రాత సామర్థ్యాలు, గణిత ప్రాథమిక నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రెమిడియేషన్, AXL AI, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల పురోగతిని ఎంఈఓలు, హెచ్ఎంలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.



కండక్టర్ ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ అండ

హైదరాబాద్ నవంబర్,4(సమయం న్యూస్,)

ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద కండక్టర్ ప్రవళిక పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నివాళులర్పించారు.ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వంఆర్టీసీ తరపున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, బ్యాంకు ప్రమాద బీమా ద్వారా రూ.1 కోటి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.ప్రవళిక మృతికి కారణమైన వ్యక్తిపై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



భూముల లీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

- **కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్, నవంబర్ 4:(సమయం న్యూస్)

జిల్లాలో నార్నూర్ మండలంలో కొనసాగుతున్న సమగ్ర భూముల రీసర్వే, ఎన్‌మెంట్ సర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం గంగాపూర్ (జి) గ్రామంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్‌తో కలిసి రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గంగాపూర్, మాదాపూర్, ఖైర్దట్వా, సోనాపూర్ గ్రామాల్లో రీసర్వే చేపట్టగా, గంగాపూర్‌లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 6 కిలోమీటర్ల మేర భూముల హద్దుల గుర్తింపు పూర్తయిందన్నారు.సర్వే నంబర్ 2 భూములు, గ్రామకంఠాన్ని పరిశీలించిన కలెక్టర్.. రోవర్ పరికరం పనితీరు, భూముల హద్దుల నిర్ధారణ, డేటా నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ భూములకు తొలి ప్రాధాన్యతనిస్తూ సర్వేను పూర్తి చేయాలని, సేకరించిన వివరాలను భద్రంగా భద్రపరచాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో పుల్లయ్య, సర్పంచ్ ఉష, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జయరాం, సర్వేయర్లు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



డీప్‌టెక్ ఆవిష్కరణలకు తెలంగాణలో అపార అవకాశాలు

హైదరాబాద్ నవంబర్4(సమయం న్యూస్)

డీప్‌టెక్ పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులు, సేవలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పరిశోధకులు, పరిశ్రమలు, పెట్టుబడిదారులు, ప్రభుత్వ విభాగాల సమన్వయంతో తెలంగాణను డీప్‌టెక్ హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. 203435 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. వైద్యం, వ్యవసాయం, ఇంధన రంగాల్లో డీప్‌టెక్ ఆవిష్కరణలకు విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని భట్టి విక్రమార్క ఆహ్వానించారు.



యాదవుల ఐక్యతకు సదర్ వేడుకలు ప్రతీక

హైదరాబాద్, నవంబర్ 4(సమయం న్యూస్)

యాదవుల ఐక్యతకు సదర్ వేడుకలు ప్రతీకగా నిలుస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. దీపావళి మరుసటి రోజు యాదవులు సదర్ వేడుకలను సంప్రదాయంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. గతంలో హైదరాబాద్‌కే పరిమితమైన సదర్ వేడుకలు ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ నిర్వహించడం సంతోషకరమన్నారు.చరిత్రలో యాదవుల పాత్ర విశిష్టమైనదని పేర్కొన్న తలసాని, సంఖ్యాపరంగా బలమైన యాదవులు ఐక్యంగా నిలిచి భవిష్యత్తులో రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు.



జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్,పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశానుసారం

- **సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన**
- **మహిళల భద్రత కు అండగా "షీ" టీమ్**

బొంరస్ పేట మండలం,నవంబర్,04 సమయం న్యూస్)

మహిళల భద్రత కోసమే "షీ" టీమ్ నిరంతరం పనిచేస్తుందని వికారాబాద్ జిల్లా పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు తెలిపారు.బుధవారం బొంరస్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగడి మైలారం గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రా, పరిగి డిఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిముల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు మాట్లాడుతూ, మహిళలు బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ ద్వారా ఏర్పరిచిన టోల్ ఫ్రీ నెంబర్లు 100, 112 ను సంప్రదించాలని అన్నారు. అదేవిదంగా మొబైల్ వాడకం దారులు అనుకొని పరిస్థితులలో సైబర్ క్రైమ్ లో మోసపోయినట్లు గుర్తించిన వెంబడి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు తగిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. అంతే కాకుండా మహిళలు బాలికలు టిసేఫ్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలన్నారు.ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ యాక్ట్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీ, తదితర అంశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రేగడి మైలారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రతన్ రాజ్, ఉపాధ్యాయులతో పాటు "షీ" టీమ్ సభ్యులు బి. సావిత్రి,శోభ పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 4:(సమయం న్యూస్,)

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.ఐడీఓసీలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. కేసుల దర్యాప్తును వేగంగా పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని, నిబంధనల ప్రకారం బాధితులకు పరిహారం అందేలా చూడాలని సూచించారు.జిల్లాలో ఇప్పటివరకు అట్రాసిటీ కేసుల కింద రూ.1.81 కోట్లకుపైగా పరిహారం అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు, విద్యా అవకాశాలు, ఉపకార వేతనాలు, విదేశీ విద్య, ఉపాధి పథకాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఎస్పీ మహేష్ బి. గితె మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగంగా పూర్తి చేసి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



సిరికొండ నూతన ఎస్సైగా కే. రాజశేఖర్ రెడ్డి

ఆదిలాబాద్, నవంబర్ 4(సమయం న్యూస్,,)



సిరికొండ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా కే. రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.సిరికొండ పరిధిలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.గతంలో సిరికొండ ఎస్సైగా పనిచేసిన విక్రమ్‌ను మావల పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బదిలీ చేశారు.

ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్, నవంబర్,04(సమయం న్యూస్)

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, బుధవారం పరిశీలించారు.ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు.సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు.ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు.ఈ కార్యక్రమములో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, తహసిల్దార్,సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఆటో కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

- **ఆటో డ్రైవర్ల కష్టానికి గుర్తింపు.. సంక్షేమానికి భరోసా... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

ఐనవోలు, నవంబర్ 4 (సమయం న్యూస్)



ఆటో డ్రైవర్ల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. ప్రజలకు నిరంతరం రవాణా సేవలు అందిస్తూ కుటుంబాల పోషణ కోసం శ్రమిస్తున్న ఆటో డ్రైవర్ల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.నవోలు మండలం పున్నెలు స్టేజి వద్ద ఆదర్శ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ బోర్డును హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ, వాన అనే తేడా లేకుండా కష్టపడుతూ ప్రజల ప్రయాణ అవసరాలను తీరుస్తున్న ఆటో డ్రైవర్లు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉంటూ తమ హక్కులు, సంక్షేమం కోసం సంఘటితంగా ముందుకు సాగాలని సూచించారు. అసోసియేషన్ ద్వారా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.ఆటో డ్రైవర్లకు ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించి బాధ్యతాయుతంగా సేవలందించాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అసోసియేషన్ డ్రైవర్ల సంక్షేమానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్, హన్మకొండ జిల్లా జేబీఎం చైర్మన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, సీనియర్ నాయకులు రాయపుర సాంబయ్య, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- **గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలి: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పేరపు ఆనంద్**

ఆలేరు, నవంబర్ 4(సమయం న్యూస్)



రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పేరపు ఆనంద్ కోరారు. ఎమ్మెల్సీ ఓటు ప్రాధాన్యతపై పట్టభద్రులకు అవగాహన కల్పించడంతో పాటు ఓటరు నమోదు కార్యక్రమాన్ని బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆలేరు పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం బీజేవైఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పేరపు ఆనంద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థికి మద్దతుగా నిలవాలని పట్టభద్ర ఓటర్లను కోరారు. ఇప్పటివరకు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోని పట్టభద్రుల కోసం గురువారం (నవంబర్ 5) ఆలేరు రైల్వే గేట్ సమీపంలోని మల్లన్న మిల్క్ పార్లర్ వద్ద ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు, ఇతర వివరాల కోసం పేరపు ఆనంద్‌ను 8688273143 నంబరులో సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి చిలుగూరి శాంతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శంకర్, బీజేవైఎం మండల కన్వీనర్ మంత్రి సాయి, బీజేపీ ఆలేరు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగల వెంకటేష్, ఎమ్మెల్సీ పట్టణ కన్వీనర్ వడ్డెమాన్ నరేందర్, జిల్లా సెక్రటరీ కమిటీ సభ్యుడు కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లెం రాజు పాల్గొన్నారు.

దూడల ఆరోగ్య పరిరక్షణకు నట్టల నివారణ మందుల పంపిణీ

- **మందనపల్లిలో 48 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ**

ఆలేరు, నవంబర్ 4(సమయం న్యూస్)



పశుసంపద అభివృద్ధికి పశువుల ఆరోగ్య పరిరక్షణ ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా దూడల ఎదుగుదలకు నట్టల నివారణ మందులు కీలక పాత్ర పోషిస్తాయని పశువైద్యాధికారి డాక్టర్ యాకూబ్ తెలిపారు.ఆలేరు మండలం మందన పల్లి గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడల నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సిరిమూర్తి రేణుక నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొత్తం 48 దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేశారు.అనంతరం పశువైద్యాధికారి మాట్లాడుతూ దూడల్లో నట్టల సమస్య వల్ల ఆరోగ్యంపై ప్రభావం పడటమే కాకుండా, వాటి ఎదుగుదల మందగించే అవకాశం ఉంటుందని వివరించారు. సకాలంలో నట్టల నివారణ మందులు వేయించడం వల్ల దూడలు ఆరోగ్యంగా పెరిగి, భవిష్యత్తులో మంచి పాల ఉత్పత్తితో పాటు పశుసంపద అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. పశుపోషకులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా నట్టల నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పద్మ శశిరేఖ సుదర్శన్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి పశువైద్యాధికారి డాక్టర్ యాకూబ్, జేవీఓ నరసింహ, శ్రీకాంత్, గోపి, గ్రామ రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనకు.. మూడేళ్ల అభివృద్ధికి ప్రజలే సాక్షి

- **లాఫలకాలకే పరిమితం కాకుండా 98 శాతం పనులు పూర్తి చేశాం**
- **గత పదేళ్లు, ప్రస్తుత మూడేళ్ల అభివృద్ధిని ప్రజలే బేరీజు వేసుకోవాలి... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

కాజీపేట, నవంబర్ 4 (సమయం న్యూస్)



ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కేవలం శిలాఫలకాలు వేసి అభివృద్ధి చేసినట్లు చెప్పడం కాకుండా, చేపట్టిన పనులను పూర్తిచేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనుల్లో సుమారు 98 శాతం పూర్తి చేశామని వెల్లడించారుబుధవారం కాజీపేట ప్రాంతంలోని 47, 62వ డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఎస్సీ కాలనీల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ కాలనీలు, మురికివాడలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కాజీపేటలో గతంలో రోడ్ల పరిస్థితి, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు స్వయంగా పరిశీలించాలని సూచించారు. సోమిడి నుంచి కాజీపేట పోలీస్ స్టేషన్ వరకు రహదారి అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. 47వ డివిజన్ ఎస్సీ కాలనీలో మిగిలిన రోడ్ల పనులకు రూ.50 నుంచి రూ.60 లక్షల వరకు టెండర్లు పూర్తయ్యాయని, మరో వారం నుంచి పది రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బస్టాండ్ నిర్మాణానికి స్థల సేకరణపై ప్రత్యేక దృష్టి...

కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన స్థలంపై గతంలోనే జిల్లా కలెక్టర్‌కు సమగ్ర విచారణ జరిపి పూర్తి వివరాలు వెల్లడించాలని వినతిపత్రం అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత భూమి ప్రభుత్వ భూమిగా తేలితే ప్రజా అవసరాల కోసం ఒక్క గజం కూడా వదులుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బస్టాండ్ సమస్యను తమ మూడేళ్ల పాలనలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ భూములపై విచారణ కోరాం...

వైఎస్సార్ నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని భూములపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కలెక్టర్‌కు లేఖలు అందించినట్లు తెలిపారు. కాజీపేట చౌరస్తాలో కాంప్లెక్స్ అనుమతుల మంజూరులో 2020లో నిబంధనలు ఉల్లంఘించారా లేదా అనే అంశంపై విచారణ కోరినట్లు పేర్కొన్నారు. 2026లో జారీ చేసిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, భవన వినియోగ అనుమతులపై స్పష్టత ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు.పేదల ఇళ్ల అంశాన్ని రాజకీయాలకు వాడుకోవడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. ఇటీవల 42 మందికి ఇళ్లు అందించామని, అర్హులైన పేదలకు గృహాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సంబంధించిన వివాదాలను అధికారులు పరిశీలించి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. బోడగుట్ట, సమ్మయ్య నగర్, దిండయాల్ నగర్, కంచరకుంట తదితర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలను మెరుగుపరిచినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు.చోరబండ రాజు మాదవీధుల అభివృద్ధి విషయంలో గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాతే సంబంధిత ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. సుమారు రూ.30 కోట్ల నిధులతో ఆలయ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని, ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు నష్టపరిహారంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికి ఒక ఉద్యోగం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు.రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణల కంటే ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులపైనే తమ దృష్టి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాజీపేటలో గత పదేళ్ల అభివృద్ధికి, ప్రస్తుత మూడేళ్లలో చేపట్టిన పనులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలే బేరీజు వేసుకోవాలని అన్నారు. ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని, ఇచ్చిన హామీల అమలులో జవాబుదారీతనంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- **ఎమ్మెల్యే కాలే యాదయ్య**

చేవెళ్ల, నవంబర్ 04 (సమయం న్యూస్):



గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలంలోని ఈర్లపల్లి, గొల్లగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈర్లపల్లి గ్రామంలో: రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ ప్రహరీ గోడను, రూ.4 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన నూతన స్ట్రీట్ లైట్లను ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు.గొల్లగూడెం గ్రామంలో: రూ.20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆక్లాండ్‌లో 'కింగ్' కోహ్లీ విధ్వంసం!

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

- ఐదు వికెట్ల తేడాతో కివీస్‌ను మట్టికరిపించిన టీమిండియా
- 51 బంతుల్లోనే 74 పరుగులు.. విరాట్ మెరుపు ఇన్నింగ్స్
- వర్షంతో మారిన లక్ష్యం.. 32 ఓవర్లలో 143 పరుగుల ఛేదన
- బౌలింగ్‌లో అర్ష్‌దీప్, గుర్నూర్, అన్మోల్ సత్తా
- మరో 56 బంతులు మిగిలి ఉండగానే విజయం.. సిరీస్‌లో 1-0 ఆధిక్యం



ఆక్లాండ్, నవంబర్ 4 : న్యూజిలాండ్ గడ్డపై భారత జట్టు విజయంతో వన్డే సిరీస్‌ను ప్రారంభించింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా బుధవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఆతిథ్య న్యూజిలాండ్‌ను ఓడించింది. భారత బౌలర్లు సమష్టిగా రాణించి కివీస్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయగా, పరుగుల ఛేదనలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తనదైన శైలిలో చెలరేగిపోయాడు. కేవలం 51 బంతుల్లో 74 పరుగులు చేసి భారత విజయానికి బాటలు వేశాడు. వర్షం కారణంగా డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ పద్ధతిలో భారత్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా సవరించగా, టీమిండియా 22.4 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు భారత పేసర్లు ఆరంభం నుంచే సవాల్ విసిరారు. అర్ష్‌దీప్ సింగ్ తన పదునైన బౌలింగ్‌తో ఓపెనర్లు విల్ యంగ్ (9), హెన్రీ నికోల్స్ (9)లను త్వరగానే పెవిలియన్‌కు పంపించాడు. దీంతో ఆతిథ్య జట్టు ఆరంభంలోనే ఒత్తిడిలో పడింది. టిమ్ సీఫెర్ట్ (38), గ్లెన్ ఫిలిప్స్ (30), డారిల్ మిచెల్ (28) కొంతసేపు ప్రతిఘటించినప్పటికీ భారీ భాగస్వామ్యాలను నెలకొల్పలేకపోయారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ కివీస్ బ్యాటర్లను కట్టడి చేశారు. అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టగా, గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లతో రాణించాడు. అన్మోల్ కంబోజ్ కేవలం 22 పరుగులిచ్చి రెండు కీలక వికెట్లు సాధించాడు. చివర్లో బ్లెయిర్ టిక్నర్ (34), జాకబ్ డఫీ (15 నాటౌట్) పోరాడటంతో న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ ఖాతా తెరవకుండానే కైల్ జేమీసన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. దీంతో భారత శిబిరంలో కాసేపు ఆందోళన నెలకొంది. అయితే క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఒకవైపు గిల్ నిలకడగా ఆడుతుండగా, మరోవైపు కోహ్లీ కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఈ క్రమంలో వర్షం ఆటకు అంతరాయం కలిగించడంతో భారత్ లక్ష్యాన్ని డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ పద్ధతిలో 143 పరుగులకు సవరించారు. అనంతరం కోహ్లీ తన దూకుడును మరింత పెంచాడు. గిల్‌తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. విరాట్ కోహ్లీ బ్యాటింగ్ ఈ మ్యాచ్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యూజిలాండ్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా మైదానం నలువైపులా బౌండరీలు బాదాడు. కేవలం 51 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 74 పరుగులు సాధించాడు. వన్డే క్రికెట్‌లో తన అనుభవాన్ని ప్రదర్శిస్తూనే పొట్టి క్రికెట్ తరహాలో దూకుడుగా ఆడాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 56 బంతుల్లో 37 పరుగులు చేసి కోహ్లీకి చక్కటి సహకారం అందించాడు. కోహ్లీ, గిల్ భాగస్వామ్యంతో భారత్ విజయం దాదాపు ఖాయమైంది. అయితే చివరి దశలో జాకబ్ డఫీ బౌలింగ్‌లో కోహ్లీ, అక్షర్ పటేల్ వెంటవెంటనే అవుటవడంతో కాసేపు ఉత్కంఠ నెలకొంది. శ్రేయస్ అయ్యర్ 15 పరుగులు చేయగా, కేఎల్ రాహుల్ (3 నాటౌట్), నమన్ ధీర్ (5 నాటౌట్) మిగిలిన పరుగులు సాధించి విజయాన్ని పూర్తి చేశారు. బౌలింగ్‌లో సమష్టి ప్రదర్శన, బ్యాటింగ్‌లో కోహ్లీ దూకుడుతో భారత్ తొలి వన్డేలోనే పైచేయి సాధించింది. ముఖ్యంగా ప్రత్యర్థిని 185 పరుగులకే పరిమితం చేయడంలో భారత పేసర్లు కీలక పాత్ర పోషించారు. వర్షం కారణంగా లక్ష్యం మారినప్పటికీ భారత బ్యాటర్లు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఛేదనను పూర్తి చేశారు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లోనే అద్భుత ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ మరోసారి తన బ్యాటింగ్ సత్తాను చాటాడు.

యూత్ ఒలింపిక్స్‌లో చారిత్రాత్మక కాంస్యం

స్విమ్మింగ్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన యువ సంచలనం!



బెంగళూరు/న్యూఢిల్లీ, నవంబర్ 4 : అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత యువ స్విమ్మర్ ధినిధి దేశింగు చారిత్రాత్మక కాంస్య పతకంతో దేశ కీర్తిపతాకాన్ని ఎగురవేసింది. సెనెగల్‌లోని డాకర్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న యూత్ ఒలింపిక్స్ ఈవెంట్‌లో బెంగళూరుకు చెందిన 16 ఏండ్ల ఈ యువ సంచలనం అద్భుతమైన ప్రదర్శనతో మెరిసింది. స్విమ్మింగ్ విభాగంలో భారత క్రీడా చరిత్రలోనే తొలిసారిగా యూత్ ఒలింపిక్స్ పతకాన్ని అందించి సరికొత్త రికార్డు సృష్టించింది. మహిళల 100 మీటర్ల ఫ్రీస్టైల్ కేటగిరీలో తీవ్ర పోటీని తట్టుకుని నిలిచిన ధినిధి దేశింగు, నిర్ణీత లక్ష్యాన్ని కేవలం 56.27 సెకన్లలోనే పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. ఈ నూతన టైమింగ్‌తో పతకంతో పాటు జాతీయ రికార్డును కూడా తన పేరిట లిఖించుకుంది. గతంలో ఏ భారతీయ ఈతగాడికీ సాధ్యంకాని ఈ అరుదైన ఘనతను సాధించి అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను చాటిచెప్పింది. ఈ చారిత్రాత్మక పతక సాధనపై భారత్ వ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ధినిధి దేశింగు శిక్షణ, వికాసానికి అండగా నిలుస్తున్న ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్ గ్రూప్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మనవ్ మియాన్‌వాల్ మాట్లాడుతూ.. ధినిధి సాధించిన ఈ విజయం దేశానికే గర్వకారణమని కొనియాడారు. క్రీడల్లో రాణించాలనుకునే వేలాది మంది యువ ప్రతిభావంతులకు ఈ విజయం గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులోనూ ఆమెకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

నచ్చిన ఆటగాళ్లను ఎంచుకోలేకపోయా

టీమిండియాపై సచిన్ ఆసక్తికర వ్యాఖ్యలు!



న్యూఢిల్లీ, నవంబర్ 4 : క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ భారత జట్టు నాయకత్వ బాధ్యతలు, తన కెప్టెన్సీ రోజుల నాటి పరిస్థితులపై ఆసక్తిక ర విషయాలను పంచుకున్నారు. రెడ్డిట్ సామాజిక మాధ్యమం వేదికగా నిర్వహించిన ప్రత్యేక ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, తన ఫేవరెట్ కెప్టెన్లు ఎవరో వెల్లడించడంతో పాటు భారత కెప్టెన్‌గా పనిచేసిన రోజుల్లో ఎదురైన సవాళ్లను గుర్తుచేసుకున్నారు.టీమిండియా మాజీ సారథులు సౌరవ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీలు తన ఫేవరెట్ కెప్టెన్ల జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని సచిన్ స్పష్టం చేశారు. సౌరవ్ గంగూలీ నాయకత్వంలో 2003 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ ఆడిన సచిన్, ఎంఎస్ ధోనీ సారథ్యంలో 2011లో స్వదేశంలో ప్రపంచ కప్ ట్రోఫీని ముద్దాడారు. ఈ ఇద్దరు నాయకులతో కలిసి ఆడిన అనుభవం తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రస్తుత దక్షిణాఫ్రికా టెస్టు కెప్టెన్ టెంబా బవుమా నాయకత్వ పటిమను, స్ఫూర్తిని సచిన్ ప్రత్యేకంగా ప్రశంసించారు. బవుమా ముందుండి జట్టును నడిపిస్తూ దక్షిణాఫ్రికాకు అద్భుత విజయాలు అందిస్తున్నారని, దక్షిణాఫ్రికా జట్టు ఐసీసీ టైటిల్ గెలవడం ప్రపంచ క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. కెప్టెన్సీ అనుభవం గురించి మాట్లాడుతూ.. భారత జట్టుకు నాయకత్వం వహించడం ఒక గొప్ప గౌరవంగా భావిస్తానని, అయితే ఆ రోజుల్లో తనకు నచ్చిన ఆటగాళ్లను పూర్తిగా స్వేచ్ఛగా జట్టులోకి ఎంపిక చేసుకునే అవకాశం ఎప్పుడూ లభించలేదని బాహాటంగా చెప్పారు. 1990వ దశకంలో బీసీసీఐ నాటి పరిస్థితులతో పోలిస్తే, ప్రస్తుతం ఎంతో వృత్తిపరమైన వ్యవస్థగా రూపాంతరం చెందిందని సచిన్ విశ్లేషించారు. సచిన్ 1996 నుంచి 2000 మధ్య రెండు విడతల్లో మొత్తం 25 టెస్టుల్లో భారత జట్టుకు నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే. 2000లో దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ ఓటమి అనంతరం ఆయన కెప్టెన్సీ నుంచి తప్పుకోగా, 2007లో మరొకసారి వచ్చిన అవకాశాన్ని వద్దని చెప్పి ఆ బాధ్యతలను ధోనీకి అప్పగించేలా ప్రోత్సహించారు.

ఐఓఏ అథ్లెట్స్ కమిషన్ సభ్యులుగా సింధు, చాను



ఢిల్లీ: అగ్రశ్రేణి క్రీడాకారిణులు పీవీ సింధు, మీరాబాయి చాను సహా 10 మంది క్రీడాకారులు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ మాజీ అథ్లెట్ సుధా సింగ్ సోమవారం రాత్రి పోటీ నుంచి వైదొలగడంతో 10 పదవులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో ఎన్నిక అవసరం లేదని భావించిన రిటర్నింగ్ అధికారి సంజయ్ శ్రీవాస్తవ 10 మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంగళవారం ప్రకటించారు. అంతకుముందు సోమవారం స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ కూడా తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నాడు. దీంతో సింధు (బ్యాడ్మింటన్), చాను (వెయిట్ లిఫ్టింగ్), హర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), సలీమా టెటె (హాకీ), స్వప్నిల్ కుశాలె (షూటింగ్), భవాని దేవి (ఫెన్సింగ్), తజిందర్‌సింగ్ తూర్ (అథ్లెటిక్స్), బాంబేలా దేవి (ఆర్చరీ), సాజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), మన్‌జీత్ సింగ్ (కయాకింగ్- కనోయింగ్)ల ఎన్నికకు మార్గం సుగమమైంది. అథ్లెట్స్ కమిషన్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల్లో (ఒకరు పురుషుడు, మరొకరు మహిళ) ఎన్నికైన వారు ఐఓఏ కార్యవర్గ మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్)లో సభ్యులుగా బాధ్యతలు చేపడతారు. ఈ కమిషన్ నుంచి ఇద్దరు సభ్యులు (ఒకరు పురుషుడు, మరొకరు మహిళ) ఓటు హక్కుతో ఐఓఏ సర్వసభ్య సమావేశంలో సభ్యులుగా ఉంటారు. అథ్లెట్స్ కమిషన్‌లోని ఈ పదవులకు త్వరలోనే ఎన్నికలు జరుగనున్నాయి.

వయసు 39.. వేగం మాత్రం చిరుతను మించి!

మైదానంలో రోహిత్ శర్మ అద్భుత విన్యాసం



ఆక్లాండ్, నవంబర్ 4 : వయసు పెరిగినా ఆటలో వేగం తగ్గలేదని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి నిరూపించాడు. 39 ఏళ్ల వయసులోనూ మైదానంలో చిరుతలా కదులుతూ అద్భుతమైన ఫీల్డింగ్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచాడు. న్యూజిలాండ్‌తో ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ప్రమాదకర బ్యాటర్ డారిల్ మిచెల్‌ను రనౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. బంతిని అడ్డుకునేందుకు వేగంగా పరుగెత్తడం, వెంటనే డైవ్ చేస్తూ వికెట్ల వైపు త్రో విసరడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. రోహిత్ చురుకుదనానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అతడి ఫిట్‌నెస్‌లో వచ్చిన మార్పును అభిమానులు ప్రశంసిస్తున్నారు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 22వ ఓవర్‌లో ఈ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. గ్లెన్ ఫిలిప్స్ ఆడిన బంతి షార్ట్ మిడ్ వికెట్ దిశగా వెళ్లింది. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న రోహిత్ శర్మ బంతిని అడ్డుకునేందుకు వేగంగా కదిలాడు. స్క్వేర్ లెగ్ వైపు పరుగెత్తి బంతిని అందుకున్న వెంటనే డైవ్ చేస్తూ వికెట్ల వైపు అద్భుతమైన త్రో విసిరాడు. బంతి నేరుగా వికెట్లను తాకకపోయినా వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ అప్రమత్తంగా వ్యవహరించాడు. రోహిత్ విసిరిన బంతిని అందుకుని వెంటనే బెయిల్స్ పడగొట్టాడు. దీంతో డారిల్ మిచెల్ 28 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌటయ్యాడు. కీలక సమయంలో వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్ మరింత ఒత్తిడిలో పడింది. రోహిత్ వేగానికి మిచెల్ సైతం ఆశ్చర్యపోయినట్లు కనిపించింది. గతంలో రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై పలుమార్లు విమర్శలు వచ్చాయి. వయసు పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్‌లో ఎంతకాలం కొనసాగగలడనే ప్రశ్నలు కూడా తలెత్తాయి. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్‌లో అతడు ఆడగలడా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే గత ఏడాదిన్నర కాలంగా రోహిత్ తన శారీరక దృఢత్వంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా పర్యటన నుంచి అతడి కదలికల్లోనూ, ఫీల్డింగ్‌లోనూ చురుకుదనం కనిపిస్తోంది. తాజాగా న్యూజిలాండ్‌పై చేసిన రనౌట్ అతడి ఫిట్‌నెస్‌కు మరో ఉదాహరణగా నిలిచింది. బంతిని వెంబడించిన తీరు, డైవ్ చేసిన విధానం, వేగంగా త్రో విసిరిన సమయస్ఫూర్తి అభిమానులను ఆకట్టుకున్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టును విజేతగా నిలిపిన రోహిత్ శర్మ ఆ తర్వాత వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అతడి స్థానంలో యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. దీంతో రోహిత్ అంతర్జాతీయ క్రికెట్ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. అయితే కెప్టెన్సీ లేకపోయినా జట్టులో తన పాత్రను సమర్థంగా నిర్వర్తించేందుకు రోహిత్ కృషి చేస్తున్నాడు. బ్యాటింగ్‌తోపాటు ఫీల్డింగ్‌లోనూ మెరుగైన ప్రదర్శన కనబరచడంపై దృష్టి పెట్టాడు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో వన్డే క్రికెట్‌కే పరిమితమైన రోహిత్‌కు 2027 ప్రపంచకప్ ప్రధాన లక్ష్యంగా మారిందని క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు కూడా సమష్టిగా రాణించారు. టాస్ గెలిచిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా, ఆ నిర్ణయాన్ని భారత పేసర్లు సమర్థించారు. క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ న్యూజిలాండ్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. కివీస్ ఇన్నింగ్స్ 31 ఓవర్లు ముగిసే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 131 పరుగులు చేసింది. ఆ దశలో గ్లెన్ ఫిలిప్స్ 27 పరుగులతో, కైల్ జేమీసన్ ఒక పరుగుతో క్రీజులో ఉన్నారు. 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మను మరోసారి భారత జెర్సీలో చూడాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో అతడి ఫిట్‌నెస్, బ్యాటింగ్ ప్రదర్శనలపై ప్రత్యేక దృష్టి నెలకొంది. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో చేసిన అద్భుత రనౌట్ ద్వారా ఫీల్డింగ్‌లోనూ తాను చురుకుగా ఉన్నానని రోహిత్ చాటాడు. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని నిరూపించేలా అతడి డైవ్ ఉందంటూ అభిమానులు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు కురిపిస్తున్నారు.

భారత త్రయానికి స్వర్ణం



దోహా: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో రవీందర్ సింగ్, సౌరభ్ చౌదరి, అమన్‌ప్రీత్ సింగ్‌తో కూడిన భారత త్రయం పసిడిని గురిపెట్టింది. ఫైనల్‌లో ఈ త్రయం.. 1659 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకాన్ని నెగ్గింది. ఇదే ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో రవీందర్ సింగ్ 559 పాయింట్లతో రజతాన్ని గెలిచాడు.



హీరోయిన్లకూ భారీ కటౌట్లు ఉండాల్సిందే!

హీరోలతో సమానంగా కథానాయికలకూ గుర్తింపు దక్కాలి: రెజీనా

చెన్నై/హైదరాబాద్, నవంబర్ 4 : సాధారణంగా చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయకులకు థియేటర్ల వద్ద అభిమానులు భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తుంటాం. అయితే అదే స్థాయిలో హీరోయిన్లకూ అభిమానుల నుంచి తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని నటి రెజీనా అభిప్రాయపడ్డారు. స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్న 'మూకుత్తి అమ్మన్-2' (తెలుగులో 'మహాశక్తి') సినిమా విడుదల సందర్భంగా ఆమెకు అభిమానులు 60 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేయడంపై రెజీనా తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గతంలో కేవలం హీరోలకే పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడు కథానాయికలకూ విస్తరించడం చిత్ర పరిశ్రమలో వస్తున్న గొప్ప పరిణామమని పేర్కొన్నారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రెజీనా తొలిసారి ప్రతినాయిక (విలన్) పాత్రలో నటించారు. సినిమా విడుదల సందర్భంగా ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "దశాబ్దాలుగా తమిళ చిత్ర పరిశ్రమలో కేవలం అగ్ర హీరోలకే భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తున్నాం. హీరోయిన్లకు ఇటువంటి గౌరవం దక్కడం చాలా అరుదైన విషయం. నయనతారకు 60 అడుగుల కటౌట్ ఏర్పాటు చేసిన తర్వాతే 'తాయ్ కిళవి' సినిమా కోసం సీనియర్ నటి రాధిక మేడమ్‌కు కూడా కటౌట్ ఏర్పాటు చేశారని తెలిసింది. హీరోలతో సమానంగా నటీమణులకూ కటౌట్లు పెట్టడం పరిశ్రమలో సానుకూల మార్పుకు నిదర్శనం" అని వ్యాఖ్యానించారు. ఈ సినిమా ద్వారా తన కెరీర్‌లోనే తొలిసారి ఒక భారీ కమర్షియల్ చిత్రంలో నెగెటివ్ పాత్ర పోషించే అవకాశం లభించిందని, ఇది తనకు సరికొత్త అనుభూతిని ఇచ్చిందని రెజీనా తెలిపారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలకు పరిమితం కావడం తనకు ఎంతమాత్రం నచ్చదని, అందుకే కథల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నానని చెప్పారు. తక్కువ సినిమాలు చేసినా సమాజంలో నిలిచిపోయే మంచి పాత్రలనే ఎంచుకుంటానని స్పష్టం చేశారు. నయనతార, ఊర్వశి, రెజీనా ప్రధాన పాత్రల్లో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నవంబరు 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో నజ్రియ?

తెరపై క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో సినీప్రియుల్లో మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్నారు మలయాళ తార నజ్రియా. 'సూక్ష్మదర్శిని' సినిమా తర్వాత కథానాయికగా ఆమె థియేటర్లలో సందడి చేసి రెండేళ్లైంది. అయినప్పటికీ ఆమె ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటిస్తూ తెర వెనుక నిర్మాతగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడామె హీరో సూర్య సరసన 'సీన్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా నజ్రియా మరో తమిళ చిత్రంలో నటించనున్నట్లు తెలుస్తోంది. 'ఎల్ఐకే' సినిమాతో ఇటీవల ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయారు దర్శకుడు విఘ్నేశ్ శివన్. ఇప్పుడాయన తదుపరి చిత్రంలో కథానాయిక కోసం నజ్రియాని సంప్రదించనున్నారట. ఇప్పటికే ఇందులో నటుడు అరవింద్ స్వామి, భరత్ ప్రధాన పాత్రల్లో ఖరారయ్యారని, రొమాంటిక్ కామెడీగా రూపొందనున్న ఈ సినిమాని ప్యాషన్ స్టూడియోస్, నయనతార నిర్మాణసంస్థ రౌడీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయని సన్నిహిత వర్గాల సమాచారం.



జనీకాంత్‌తో శ్రీలీల

అధికారికంగా ప్రకటించిన 'ధర్మన్' మేకర్స్!

చెన్నై/హైదరాబాద్, నవంబర్ 4 : సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా ప్రముఖ దర్శకుడు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ధర్మన్'. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ క్రేజీ సినిమాలో యంగ్ అండ్ ఎనర్జిటిక్ నటి శ్రీలీల కథానాయికగా నటించనున్నట్లు గత కొన్ని రోజులుగా సినీ వర్గాల్లో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రచారంపై చిత్ర యూనిట్ అధికారికంగా స్పందిస్తూ ముగింపు పలికింది. శ్రీలీల ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనట్లు తెలియజేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా ఒక ప్రత్యేక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ ఒక శక్తివంతమైన వైద్యుడి (డాక్టర్) పాత్రలో కనిపించనుండటం విశేషం. విభిన్న కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో టాలీవుడ్ హీరో రామ్ పోతినేని, సీనియర్ నటి సిమ్రాన్, రాశీఖన్నా, నయనతార, కమెడియన్ యోగిబాబు తదితరులు అత్యంత కీలకమైన పాత్రల్లో నటించనున్నారు. భారీ తారాగణంతో ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకి రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. రజనీకాంత్, కమల్ హాసన్ నిర్మాణ సంస్థల కలయికలో శ్రీలీల, రామ్ పోతినేని వంటి యువ నటులు భాగం కావడంతో ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.





దియా మీర్జా దీపావళి వీడియో

బీఎంసీకి బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు!

ముంబై, నవంబర్ 4 : దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని పిలుపునిస్తూ ప్రముఖ నటి దియా మీర్జా రూపొందించిన ప్రచార వీడియోను సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించడంపై బాంబే హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రాజకీయ నేతల ఒత్తిళ్లు, అభ్యంతరాల కారణంతో తొలగించిన ఆ వీడియోను తక్షణమే తిరిగి అప్‌లోడ్ చేయాలని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులను ఆదేశించింది. దీపావళి పండుగ వేళ వాయు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు బీఎంసీ ప్రత్యేకంగా ఒక వినూత్న అవగాహన ప్రచారాన్ని చేపట్టింది. అందులో భాగంగా సినీ నటీమణులు దియా మీర్జా, మాధురీ దీక్షిత్, ప్రముఖ క్రికెటర్ అజింక్య రహానే వంటి ప్రముఖులతో ప్రత్యేక ప్రచార వీడియోలను చిత్రీకరించి తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసింది. తన వీడియోలో దియా మీర్జా బాంబే హైకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ.. రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై బాణసంచా కాల్చవద్దని, పర్యావరణానికి హాని కలగకుండా దీపావళిని జరుపుకోవాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు. అయితే దియా మీర్జా చేసిన వ్యాఖ్యలపై మహారాష్ట్ర మంత్రి నితేష్ రాణేతో పాటు పలువురు బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కేవలం హిందూ పండుగల సమయంలోనే ఇటువంటి నిబంధనలు గుర్తుకొస్తాయా అంటూ విమర్శలకు దిగారు. దీంతో ఒత్తిడికి లొంగిపోయిన బీఎంసీ యాజమాన్యం తమ సోషల్ మీడియా పేజీల నుంచి ఆ వీడియోను ఉన్నపళంగా తొలగించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన బాంబే హైకోర్టు బీఎంసీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజా ఆరోగ్యం, వాయు కాలుష్యంపై అవగాహన కల్పించే సాధారణ వీడియోకి మతం రంగు పులమడం తీవ్ర విచారకరమని వ్యాఖ్యానించింది. పీల్చే గాలికి, కాలుష్యానికి కులం, మతం అనే తేడాలు ఉండవని స్పష్టం చేస్తూ తొలగించిన వీడియోను పునరుద్ధరించాలని తీర్పునిచ్చింది.

PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

తెలంగాణకు కేంద్రం నుంచి భారీ ఊరట

- **అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.3,892 కోట్లకు ఐదు ప్రాజెక్టులకు ఆమోదం**

హైదరాబాద్, నవంబర్ 5, సమయం న్యూస్

తెలంగాణకు అర్బన్ మౌలిక వసతుల అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన 4వ జాతీయ అపెక్స్ కమిటీ (NAC) సమావేశంలో తెలంగాణ నుంచి ప్రతిపాదించిన ఐదు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. మొత్తం రూ.3,892.38 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులకు కేంద్రం రూ.873.49 కోట్ల ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ప్రధానంగా హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాలు, వరంగల్ నగర వరద నియంత్రణ, వారసత్వ కట్టడాల అభివృద్ధి, హనుమకొండ వాణిజ్య కేంద్రం ఆధునికీకరణ, అలంపూర్ ఆలయ పట్టణ పునరుద్ధరణ వంటి అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఈ జాబితాలో ఉన్నాయి.

ఆమోదం పొందిన ప్రాజెక్టులు

గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్టు ఫేజ్ II, III (HMWSSB)*

రూ.1,992 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు రూ.398.40 కోట్ల కేంద్ర సహాయం లభించింది. గోదావరి జలాలను ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్లకు తరలించడం ద్వారా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 2035 వరకూ తాగునీటి అవసరాలను తీర్చే లక్ష్యంతో దీనిని అమలు చేస్తున్నారు.

గ్రేటర్ వరంగల్ సమగ్ర వర్షపు నీటి పారుదల ప్రణాళిక

రూ.1,465 కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు రూ.366.25 కోట్ల కేంద్ర సహాయం లభించింది. తరచూ వరదల బారిన పడుతున్న వరంగల్ నగరంలో 24 ప్రధాన వరద ముప్పు ప్రాంతాలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యం.

వరంగల్ కోట కందకం పునరుద్ధరణ ప్రాజెక్టు

రూ.209.08 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు రూ.52.27 కోట్ల కేంద్ర సహాయం అందనుంది. కాకతీయుల వారసత్వ చిహ్నమైన కందకాన్ని పునరుద్ధరించి పర్యాటక అభివృద్ధి, వరద నియంత్రణకు వినియోగించనున్నారు.

హనుమకొండ సీబీడీ (CBD) అభివృద్ధి ప్రాజెక్టు

రూ.168.80 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టులో ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్, మల్టీలెవల్ పార్కింగ్ సముదాయాలు, భద్రకాళి ఆలయ పరిసరాల అభివృద్ధి, సెంట్రల్ ప్లాజా పునర్నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు.

అలంపూర్ సమగ్ర వారసత్వ, పర్యాటక మరియు పట్టణ పునరుద్ధరణ ప్రాజెక్టు

రూ.57.50 కోట్ల వ్యయంతో అమలు చేయనున్న ఈ ప్రాజెక్టుకు రూ.14.38 కోట్ల కేంద్ర సహాయం లభించింది. జోగులాంబ ఆలయం, నవబ్రహ్మ దేవాలయాల పరిసర ప్రాంతాల్లో పర్యాటక సదుపాయాలు, పార్కింగ్, వారసత్వ కారిడార్ అభివృద్ధి చేయనున్నారు.

మొత్తం ఎనిమిది యూసీఎఫ్ ప్రాజెక్టులకు ఆమోదం

ఇప్పటికే తొలి NAC సమావేశంలో తెలంగాణకు మూడు ప్రాజెక్టులకు రూ.5,681.04 కోట్ల విలువైన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. తాజా ఐదు ప్రాజెక్టులతో కలిపి రాష్ట్రానికి ఇప్పటివరకు *మొత్తం ఎనిమిది అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రాజెక్టులు*, రూ.9,573.42 కోట్ల విలువతో ఆమోదం పొందాయి. వీటికి కేంద్రం నుంచి మొత్తం రూ.2,293.75 కోట్ల సహాయం లభించనుందిరాష్ట్రప్రభుత్వ పట్టణాభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం నుంచి లభించిన ఈ తాజా ఆమోదాలు హైదరాబాద్, వరంగల్, అలంపూర్ వంటి ప్రాంతాల్లో మౌలిక వసతులు, పర్యాటకం, తాగునీటి సరఫరా మరియు వరద నియంత్రణ రంగాలకు గణనీయమైన ఊతమివ్వనున్నాయి.

బీసీల ఐక్యతతో ఎమ్మెల్సీ విజయాలు సాధించాలి

- **బీసీలకు రాజకీయ గౌరవం.. రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించిన కవిత**
- **బీసీ బిడ్డలను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి... పంజాల శ్రీరామ్**

నర్సంపేట, నవంబర్ 4 (సమయం న్యూస్) :



త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను బీసీ అభ్యర్థులకు కేటాయించడం సామాజిక తెలంగాణ సాధనలో చారిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ రక్షణ సేన నర్సంపేట నియోజకవర్గ నాయకుడు పంజాల శ్రీరామ్ అన్నారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తీసుకున్న ఈ నిర్ణయం బీసీల పట్ల ఆమెకున్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.వరంగల్ఖమ్మం నల్గొండ, హైదరాబాద్రంగారెడ్డిమహబూబ్నగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో పార్టీ తొలిసారిగా పోటీ చేస్తూ, రెండు స్థానాలను బీసీ బిడ్డలకే కేటాయించడం అభినందనీయమన్నారు.వరంగల్ఖమ్మంనల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాకతీయ విశ్వవిద్యాలయ ఉద్యమ బిడ్డ, గౌడ సామాజిక వర్గానికి చెందిన విద్యావేత్త డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ను, హైదరాబాద్రంగారెడ్డిమహబూబ్నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం పూర్వ విద్యార్థి, జాతీయ మీడియాలో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ ఆకాష్ కొల్లూరి ప్రజాపతిని ఎంపిక చేయడం బీసీలకు గర్వకారణమని తెలిపారు.ఈ సందర్భంగా పంజాల శ్రీరామ్ మాట్లాడుతూ మొదటి నుంచి సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న కవితక్క మాటల్లోనే కాకుండా చేతల్లోనూ తన నిబద్ధతను చాటుకున్నారని అన్నారు. కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యావంతులైన ఉద్యమకారులకు అవకాశం కల్పించడం ద్వారా బీసీల పట్ల తన అభిమానాన్ని, సామాజిక న్యాయంపై తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని పేర్కొన్నారు. ఇంత గొప్ప అవకాశం కల్పించిన కవితక్కకు ధన్యవాదాలు తెలిపారు.పార్టీలకు అతీతంగా బీసీలంతా ఐక్యంగా నిలిచి ఈ ఇద్దరు బీసీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని నర్సంపేట నియోజకవర్గం తరపున పంజాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేసుకోవడం ద్వారా సామాజిక న్యాయ సాధనకు ముందుకు సాగాలన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన టీజేఎస్ రాష్ట్ర బృందం

- **నిరుద్యోగులు, విద్యార్థులు, కౌలు రైతుల సమస్యలపై చర్చ**
- **పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి**

నర్సంపేట, నవంబర్ 4 (సమయం న్యూస్



రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యార్థులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు ప్రజా సమస్యలపై తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చర్చించింది. టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడం, పెండింగ్లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించడం, రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయడం వంటి అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులో 22వ ప్యాకేజీ కింద పనుల నిర్మాణం, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తెగిపోయిన చెరువుల ఆనకట్టల పునర్నిర్మాణం, ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో కౌలు రైతుల సమస్యలు, ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న తాగునీటి సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని టీజేఎస్ రాష్ట్ర బృందం కోరినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో పాటు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్, పీఎల్ విశ్వేశ్వరరావు, ధర్మార్జున్, గోపగాని శంకర్రావు, బైరి రమేష్, అధికార ప్రతినిధి సలీం పాషా, నిజ్జన రమేష్, ఆశప్ప, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు

- **తప్పనిసరిగా పాటించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**

నారాయణపేట, నవంబర్,04(సమయం న్యూస్)

నారాయణపేట: జిల్లా పరిధిలో బాణసంచా (టపాసుల) దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహించాలనుకునే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS సూచించారు. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి ముందస్తు అనుమతులు, లైసెన్సులు పొందిన తర్వాతే విక్రయాలు ప్రారంభించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పేలుడు పదార్థాల చట్టం-1884 (Explosives Act, 1884), పేలుడు పదార్థాల నిబంధనలు-2008 (Explosives Rules, 2008) ప్రకారం తాత్కాలిక లేదా శాశ్వత బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నా సంబంధిత లైసెన్సింగ్ అథారిటీ నుంచి ముందస్తు అనుమతి, లైసెన్స్ పొందడం తప్పనిసరి అని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసి బాణసంచా విక్రయాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బాణసంచా దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వ నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు.బాణసంచా దుకాణాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిమాపక యంత్రాలు (Fire Extinguishers), ఇసుక బకెట్లు, నీటి బకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటించడంతో పాటు దుకాణం వద్ద అందరికీ స్పష్టంగా కనిపించే విధంగా "పొగ త్రాగడం నిషేధం - NO SMOKING" బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.బాణసంచా దుకాణాల వద్ద పాటించాల్సిన ముఖ్యమైన భద్రతా నిబంధనలు:



1. దుకాణంలో పొగ త్రాగడం పూర్తిగా నిషేధం.
2. అగ్నిపుల్లలు, లైటర్లు లేదా ఇతర అగ్ని ప్రమాదానికి కారణమయ్యే వస్తువులను వినియోగించరాదు.
3. దుకాణంలో వంట చేయడం, మంటలు ఉపయోగించడం పూర్తిగా నిషేధం.
4. అగ్నిమాపక యంత్రాలు, ఇసుక బకెట్లు, నీటి బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి.
5. విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ విషయంలో తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలి.
6. లైసెన్స్లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగానే బాణసంచా నిల్వలు, విక్రయాలు నిర్వహించాలి.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు నిర్వహించినా,నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు ఉంచినా, భద్రతా ప్రమాణాలు పాటించకుండా ప్రమాదకర పరిస్థితుల్లో దుకాణాలు ఏర్పాటు చేసినా సంబంధిత యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు. బాణసంచా వ్యాపారులు పోలీస్, అగ్నిమాపక శాఖలతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల నిబంధనలు పాటిస్తూ అవసరమైన అనుమతులు పొందాలని కోరారు. పండుగల సమయంలో ఎలాంటి అగ్నిప్రమాదాలు,అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వ్యాపారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె

చేవెళ్ల, నవంబర్ 04 (సమయం న్యూస్): ఆశా



కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హెచ్చరించారు. ఈ మేరకు షాబాద్, చందనవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా అల్లి దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా కార్యకర్తలు గత 20 సంవత్సరాలుగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు సీజనల్, అంటువ్యాధులు,దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే హైదరాబాద్ కోఠిలోని కమిషనర్ కార్యాలయం వద్ద అనేక ఆందోళనలు, పోరాటాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. ఇక సమ్మె తప్ప మరో మార్గం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాబాద్, చందనవల్లి ప్రాంతాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్నినో ప్రభావంతో తాగునీటికి ముందస్తు చర్యలు

- **డిసెంబర్ తర్వాత సింగూరు నుంచి నీటి సరఫరా నిలిచే అవకాశం: కలెక్టర్ ప్రతిమా సింగ్**

మెదక్, నవంబర్ 4:(సమయం న్యూస్.)

ఎల్నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సర్దన చెక్డ్యామ్ను పరిశీలించిన ఆమె, ప్రత్యామ్నాయ నీటి వనరుల కోసం ప్రభుత్వం రూ.42 కోట్లు మంజూరు చేసిందన్నారు.సర్దన నుంచి జక్కన్నపేట వరకు పైప్లైన్ ఏర్పాటు చేసి 33 గ్రామాలకు తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. పొడ్చాన్పల్లి, కొత్తపల్లి, మిన్పూర్ చెక్డ్యామ్ల వద్ద కూడా ప్రత్యామ్నాయ గ్రిడ్లు ఏర్పాటు చేస్తామన్నారు.ప్రజలు నీటిని, విద్యుత్ను పొదుపుగా వినియోగించాలని, అధికారులు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.



రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి

హైదరాబాద్, నవంబర్ 4:(సమయం న్యూస్)

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొనాలని కోరారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండలో హైదరాబాద్ తరహాలో ఇందిరమ్మ టవర్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రూ.40 వేల కోట్లతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



గోపరాజుపల్లి గ్రామంలో భూముల రీ సర్వే కార్యక్రమం

వలిగొండ నవంబర్ 04 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజుపల్లి గ్రామంలో భూముల రీ సర్వే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసిల్దార్ పల్లవి రెడ్డి గ్రామ పరిపాలన అధికారులు పరుశురాం, కల్పన, బాల కృష్ణ, కృష్ణ, లైసెన్స్ సర్వేయర్ నరసింహ గ్రామ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.3.5 లక్షల విలువైన పరికరాల వితరణ

కరీం నగర్ నవంబర్,4(సమయం న్యూస్)

తల్లిదండ్రులు సత్తమ్మ-అంజయ్యల జ్ఞాపకార్థం రూ.3.5 లక్షల విలువైన పరికరాలను విరాళంగా అందించేందుకు ముందుకొచ్చిన కరీంనగర్ ఆర్కే ఆగ్రోస్ అధినేతలు మియాపురం నాగరాజు, రామకృష్ణలను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు అభినందించారు.తల్లిదండ్రుల పేరిట సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మంత్రి అన్నారు. బుధవారం మంత్రి నివాసంలో నాగరాజు, రామకృష్ణలు ఆయనను కలిసి తమ సేవా కార్యక్రమాల వివరాలను తెలిపారు.కొండయ్యపల్లి గ్రామపంచాయతీకి రూ.1.5 లక్షల విలువైన పారిశుద్ధ్య పరికరాలు, మంథని నియోజకవర్గం ముత్తారం కస్తూర్బా బాలికల వసతి గృహానికి రూ.2 లక్షల విలువైన ఆటోమేటిక్ చపాతీ తయారీ యంత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈ యంత్రం గంటకు 500 చపాతీలు తయారు చేయగలదు. కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్,ఉపసర్పంచ్ అనవేన హరిత తిరుపతి పాల్గొన్నారు.



ఉపాధి, జల సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి

ములుగు, నవంబర్ 4(సమయం న్యూస్)

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.హైదరాబాద్ నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఉపాధి పనులు, కూలీల హాజరు, జాబ్కార్డులు, జలసిరి పనులు, గ్రామీణ మౌలిక వసతులపై సమీక్షించారు. రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీల్లో 12,280 చోట్ల ఉపాధి పనులు ప్రారంభమయ్యాయని, నవంబర్ 3న 5.02 లక్షల మంది కూలీలు పనులకు హాజరయ్యారని తెలిపారు.ములుగు జిల్లాలో 171 పంచాయతీలకు గాను 162 చోట్ల ఉపాధి పనులు ప్రారంభించగా, 7,465 మంది కూలీలు హాజరయ్యారు. కూలీల సగటు హాజరు 46గా ఉండటం, రాష్ట్ర సగటు 41 కంటే మెరుగ్గా ఉండటంపై జిల్లా అధికారులను కమిషనర్ అభినందించారు.జలసిరి కింద రాష్ట్రవ్యాప్తంగా 55,133 పనులు ప్రారంభించి, 14,121 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. వ్యవసాయ కుంటలు, ఊటకుంటలు, ఇంకుడు గుంతలు, బోర్వెల్ రీఛార్జ్ నిర్మాణాలతో పాటు పశుగ్రాస సాగు, పశువుల తాగునీటి తొట్టెలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ములుగు జిల్లాలో నవంబర్ 19 నాటికి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాల్సిన 254 నిర్మాణాల పనులను వేగవంతం చేసి, నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

లింగంపల్లి కుర్దును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

కామారెడ్డి, నవంబర్ 4(సమయం న్యూస్)

లింగంపల్లి కుర్దును ప్లాస్టిక్ రహిత, పర్యావరణహిత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గ్రామంలో నీటి సంరక్షణ, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు.రబీలో వరికి బదులుగా జొన్న, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఉపాధి హామీ పనుల్లో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. చెరువుకట్టపై మొక్కలు నాటి, సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



కొడంగల్‌లో మెగా రైతు మేళా

హైదరాబాద్ నవంబర్4(సమయం న్యూస్)

నవంబర్ 7 నుంచి 9 వరకు కొడంగల్‌లో మెగా రైతు మేళా నిర్వహించనున్నారు. నవంబర్ 7న సీఎం రేవంత్ రెడ్డి మేళాను ప్రారంభించనున్నారు. 150 ప్రదర్శన స్టాళ్లలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యంత్రాలు, డ్రోన్లు, నూతన సాంకేతికతపై అవగాహన కల్పించనున్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో సమావేశాలు నిర్వహిస్తారు. చివరి రోజు 10 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరవుతారని అంచనా. రైతులందరూ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

గ్రిడ్ స్థాయి ఇంధన నిల్వ వ్యవస్థలకు రూ.14,500 కోట్ల నిధులు

- **కేంద్ర కేబినెట్ నిర్ణయం**

న్యూఢిల్లీ, నవంబర్ 4:(సమయం న్యూస్)

దేశంలో గ్రిడ్ స్థాయి ఇంధన నిల్వ వ్యవస్థల అభివృద్ధికి రూ.14,500 కోట్ల సాధ్యత అంతర నిధుల పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.ఈ పథకం ద్వారా 92 గిగావాట్‌గంటల ఇంధన నిల్వ సామర్థ్యం అభివృద్ధి చేయనున్నారు. ఇందులో 60 గిగావాట్‌గంటల పంప్డ్ స్టోరేజ్, 30 గిగావాట్‌గంటల బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, 2 గిగావాట్‌గంటల ప్రత్యామ్నాయ నిల్వ సాంకేతికతలు ఉన్నాయి.పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచడం, గ్రిడ్ స్థిరత్వాన్ని మెరుగుపరచడం, నిరంతరాయంగా అందుబాటులో ఉండే చౌకైన విద్యుత్ సరఫరాకు ఈ పథకం దోహదపడనుంది. బ్యాటరీ నిల్వ ప్రాజెక్టుల్లో కనీసం 40 శాతం దేశీయ ఉత్పత్తుల వినియోగం తప్పనిసరి చేయడం ద్వారా దేశీయ తయారీని ప్రోత్సహించి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించనున్నారు.

కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం

- **విస్తార్ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం**

న్యూఢిల్లీ, నవంబర్ 4(సమయం న్యూస్)

దేశ అధికారిక గణాంక వ్యవస్థను ఆధునికీకరించేందుకు 'వికసిత్ భారత్ ఇనిషియేటివ్ ఫర్ స్టాటిస్టికల్ ట్రాన్స్‌ఫర్మేషన్, అనలిటిక్స్ అండ్ రీసెర్చ్ (VISTAR)' పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 202627 నుంచి 203031 వరకు అమలు చేయనున్న ఈ పథకానికి రూ.4,371.10 కోట్ల కేటాయింపునకు ఆమోదం లభించింది. వాస్తవ సమయ గణాంకాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత డేటా, డిజిటల్ గణాంక వ్యవస్థను అభివృద్ధి చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. పథకం కింద 59 సర్వేలు నిర్వహించనున్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గణాంక సామర్థ్యాన్ని పెంచడంతో పాటు జిల్లా స్థాయిలో నాణ్యమైన గణాంకాల సేకరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.అలాగే 8వ ఆర్థిక గణనను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సహకారంతో నిర్వహించి గ్రామ పంచాయతీ, వార్డు స్థాయి వరకు అసంఘటిత రంగంలోని సంస్థలు, కార్మికుల వివరాలను సేకరించనున్నారు.

క్రీడా అవగాహన కోసం 'ఖేలో భారత్' క్విజ్

న్యూఢిల్లీ, నవంబర్ 4(సమయం న్యూస్):

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని క్రీడా విభాగం 'ఖేలో భారత్: తయారీ నుంచి పతకం వరకు' క్విజ్‌ను మై భారత్ పోర్టల్‌లో ప్రారంభించింది.నవంబర్ 4 నుంచి 20 వరకు జరిగే ఈ క్విజ్‌లో అన్ని వయసుల భారతీయ పౌరులు పాల్గొనవచ్చు. 20 ప్రశ్నలకు 15 నిమిషాల్లో సమాధానాలు ఇవ్వాలి.దేశీయ క్రీడా వస్తువుల తయారీని ప్రోత్సహించేందుకు రూ.1,856.67 కోట్లతో చేపట్టిన ఖేలో ఇండియా క్రీడా వస్తువుల తయారీ పథకం, అలాగే 2026 ఆసియా క్రీడలు, ఆసియా పారా క్రీడల్లో భారత్ ప్రదర్శనపై ప్రశ్నలు ఉంటాయి.క్విజ్‌లో ప్రతిభ కనబరిచిన టాప్ 100 మందికి ఫిట్ ఇండియా బహుమతులు అందజేస్తారు. టై ఏర్పడితే కంప్యూటర్ ఆధారిత లాటరీ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు.క్విజ్‌లో పాల్గొనడానికి మై భారత్ పోర్టల్

మైనారిటీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

వలిగొండ నవంబర్ 04 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారుబుధవారం భువనగిరి పట్టణంలోని మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. విద్యా బోధన, విద్యార్థుల హాజరు, వసతి సౌకర్యాలు, భోజన నాణ్యతను పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ప్రోత్సహించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, పాఠశాలలో పరిశుభ్రత పాటిస్తూ మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ, మైనారిటీ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక

- **సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ నవంబర్,4(సమయం న్యూస్,):

సదర్ సమ్మేళనం యాదవులకే కాకుండా తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదవుల కోరిక మేరకు సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించి, నిర్వహణకు రూ.5 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. తెలంగాణలో కులగణన చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచామని, యాదవులకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నామని చెప్పారు. యాదగిరిగుట్ట గోశాలలో గోసంరక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి యాదవ సోదరుల సహకారం కోరారు..

ప్రజావాణి కార్యక్రమమా? లేదా 45 రోజుల ప్రణాళిక ?

- **ఫ్లెక్సీ బోర్డు చూసుకొని అర్థం కాని మండల స్థాయి సమావేశం.**

వలిగొండ నవంబర్ 04 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మండల స్థాయి మండల పరిషత్ కార్యాలయంలో గౌరవ కమిషనర్ పంచాయతీ శాఖ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 45 రోజుల కార్యచరణలో భాగంగా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో ఏ బోర్డు పెట్టాలో ఏ బోర్డు పెట్టవద్దు అధికారులకు అర్థం కావడం లేదా? ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి జగన్నాధ రావు మార్గదర్శకత్వంలో నిర్వహించిన సమావేశానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డి తాసిల్దార్ ఏ దశరథ నాయక్ మండల పంచాయత్ అధికారి వైప్రేమలత పిఎసిఎస్ అరూర్ చైర్మన్ చిట్టెడి వెంకట్రాంరెడ్డి మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ ఏపీఓ పరిశరాములు పశువైద్యాధికారి అనిల్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి అంజనీదేవి ఏఈ పంచాయతీ సందీప్ రెడ్డి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కీర్తి మిషన్ భగీరథ ఏ ఈ సుమిత్ ఐసిడిఎస్ సూపర్వైజర్ పారిజాత వివిధ గ్రామాల సర్పంచులు హాజరయ్యారు. సమావేశంలో ప్రత్యేకంగా ఎలినీనో ప్రభావాల వల్ల కలిగే పరిణామాలు వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు నీటి సంరక్షణ వాట్సాప్ నీటి నిలువ భూగర్భ జలాల పెంపుదల కవిత అంశాలపై చర్చించారు గ్రామాల్లో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్త కుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు అనంతరం గ్రామ సర్పంచులు తమ తమ గ్రామాలలో నెలకొన్న సమస్యల అవసరాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టిన చేపట్టాల్సిన పనుల ప్రాథమిక అంశాలను సమావేశంలో అధికారులు అధికారులు దృష్టికి తీసుకురావడం జరిగింది.



నూతన కమిషనర్‌కు ఘన స్వాగతం

- **మున్సిపల్ నూతన కమిషనర్ గా కంచర్ల నరేష్ రెడ్డి**
- **శాలువా కప్పి సత్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా**

నర్సంపేట, నవంబర్ 4 (సమయం న్యూస్) :



నర్సంపేట మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కంచర్ల నరేష్ రెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నూతన కమిషనర్‌కు శాలువా కప్పి సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ నూతన కమిషనర్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణ అభివృద్ధి మరింత వేగవంతం కావాలని, ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనలో సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పున్నం నరసింహా రెడ్డి, సలాఉద్దీన్ అయూబ్ ఖాన్, మాదాసి రవి, బీరం భరత్ రెడ్డి, కొత్తకొండ మేఘన శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో విషాదం.. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అండ

- **సమ్మయ్య కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**
- **రూ.2 లక్షల సాయం అందజేత**

వర్ధన్నపేట, నవంబర్ 4 (సమయం న్యూస్) :



ఉపాధి హామీ పథకం పనుల్లో నిమగ్నమై ప్రమాదవశాత్తు మృతి చెందిన ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సల్ల సమ్మయ్య కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అందజేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న సమ్మయ్య మృతి బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఈ కష్టకాలంలో అండగా ఉంటామని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం కుటుంబానికి కొంత ఊరట కలిగిస్తుందని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోశాల వెంకన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈగ దామోదర్, ఏఎంసీ మాజీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తూళ్ల రవి, పలువురు సీనియర్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

టైగర్ నల్లా నరసింహులు స్ఫూర్తితో బీసీల వాటా సాధిద్దాం

- **బీసీల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం**
- **నేడు తెలంగాణ టైగర్ నల్లా నరసింహులు 33వ వర్ధంతి**

వరంగల్, నవంబర్ 4 (సమయం న్యూస్)

అణచివేతపై తిరుగుబాటు చేసి, పీడిత ప్రజల ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన తెలంగాణ విప్లవ సింహం నల్లా నరసింహులు నేటి బీసీ ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలవాలని న్యాయవాది సుధీర్ వలస అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య హక్కుల సాధనకు ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని బీసీలు తమ వాటా సాధించేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పేదరికం నుంచి పోరాట పంథా వరకు..

1926 అక్టోబర్ 2న అప్పటి జనగామ తాలూకా కడవెండి గ్రామంలో నల్లా లచ్చయ్య, లచ్చమ్మ దంపతులకు నరసింహులు జన్మించారు. నిరుపేద పద్మశాలి చేనేత కుటుంబంలో పుట్టిన ఆయన ఏడో తరగతి వరకు చదువుకున్నారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీ, రజాకార్ల దౌర్జన్యాలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్న కాలంలో అన్యాయాలను ఎదిరిస్తూ ప్రజా ఉద్యమంలోకి అడుగుపెట్టారు.కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు, తండ్రిపై భూస్వాముల దౌర్జన్యాలు ఆయనలో తిరుగుబాటు స్ఫూర్తిని రగిలించాయి.తెలంగాణలో ప్రజా చైతన్యానికి వేదికగా నిలిచిన ఆంధ్ర మహాసభ ప్రభావంతో నరసింహులు ఉద్యమంలో మరింత చురుకుగా పాల్గొన్నారు. గ్రామగ్రామాన ప్రజలను సంఘటితం చేయడం, వెట్టిచాకిరీ నిర్మూలనకు చైతన్యం కల్పించడం, భూస్వాముల దౌర్జన్యాలను ప్రశ్నించడం ఆయన ఉద్యమ జీవితంలో కీలకంగా మారాయి. జీవిత సహచరి వజ్రమ్మను సైతం ఉద్యమంలో భాగస్వామిని చేసి, ప్రజా విముక్తి లక్ష్యంతో అజ్ఞాత జీవితాన్ని గడిపారు.1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్లా నరసింహులు జనగామ ప్రాంత దళ నాయకుడిగా కీలక పాత్ర పోషించారు. దున్నేవాడికే భూమి, వెట్టిచాకిరీ నిర్మూలన, భూస్వామ్య దోపిడీకి ముగింపు అనే లక్ష్యాలతో ప్రజలను సంఘటితం చేశారు. ఆయన నాయకత్వంలో ప్రజా రక్షణ కార్యక్రమాలు, దళాల నిర్మాణం, పోరాట వ్యూహాలు విస్తరించాయి. నిరంకుశ పాలకులను ఎదిరించిన ధైర్యసాహసాలకు గుర్తింపుగా ఆయనకు 'తెలంగాణ టైగర్' బిరుదు స్థిరపడింది.

మూడుసార్లు మరణశిక్ష.. అయినా చెక్కుచెదరని ధైర్యం...

నరసింహులు పోరాట జీవితంలో అరెస్టులు, చిత్రహింసలు, జైలు నిర్బంధం, న్యాయపరమైన కేసులు ఎదురయ్యాయి. ఏకంగా మూడుసార్లు మరణశిక్షను ఎదుర్కొన్నప్పటికీ ఆయన ధైర్యం సడలలేదు. న్యాయస్థానాల్లోనూ తన రాజకీయ, సామాజిక భావజాలాన్ని నిర్భయంగా వినిపించారు. 1951లో సాయుధ పోరాట విరమణ ప్రకటించినా ఆయన న్యాయపరమైన సమస్యలు కొనసాగాయి. చివరకు 1959 జనవరి 26న సుదీర్ఘ జైలు జీవితం నుంచి విడుదలయ్యారు.



వజ్రమ్మ త్యాగం మరువలేనిది...

నల్లా నరసింహులు పోరాట చరిత్రలో ఆయన భార్య వజ్రమ్మ త్యాగం ప్రత్యేకంగా గుర్తించదగినది. భర్తతో పాటు అజ్ఞాత జీవితాన్ని గడుపుతూ ఉద్యమంలో భాగస్వామిగా నిలిచారు. జైలు జీవితం అనుభవించారు. నిర్బంధంలో ఉన్న సమయంలోనే ఆడ శిశువుకు జన్మనివ్వడం వారి కుటుంబం ఎదుర్కొన్న కష్టాలకు నిదర్శనం. ముగ్గురు ఆడపిల్లల్లో ఒకరు మరణించగా, కుమార్తె అరుణమ్మ తండ్రి ఆశయాలను కొనసాగిస్తున్నారు.

పోరాట యోధుడే కాదు.. చరిత్ర రచయిత కూడా...

నల్లా నరసింహులు తన పోరాట అనుభవాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో రచనలు చేశారు. 1987లో తెలంగాణ సాయుధ పోరాట సలభైవ వార్షికోత్సవ సందర్భంగా తన అనుభవాలను నమోదు చేయగా, 1989లో 'తెలంగాణ సాయుధ పోరాటం నా అనుభవాలు' పుస్తకంగా వెలువడింది. ఈ రచన తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రకు విలువైన ఆధారంగా నిలిచింది.1993 నవంబర్ 5న నరసింహులు భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన పోరాట స్ఫూర్తి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

బీసీల హక్కుల సాధనకు పోరాట స్ఫూర్తి...

నల్లా నరసింహులు జీవితం పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని, సామాజిక చైతన్యం, ధైర్యం, నిబద్ధతతో సామాన్యులు సైతం అసామాన్య చరిత్ర సృష్టించగలరని నిరూపించింది. అధికారం ముందు తలవంచని ఆత్మగౌరవం, అన్యాయం ముందు మౌనం వహించని పోరాట పటిమ, ప్రజా ప్రయోజనాల కోసం త్యాగం చేసే గొప్ప గుణాలు ఆయన వ్యక్తిత్వానికి ప్రతీకలు.నేటి ప్రజాస్వామ్య భారతదేశంలో బీసీలు తమకు దక్కాల్సిన హక్కులు, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం సాధించుకోవాలంటే ఐక్య పోరాటాలు అవసరమని సుధీర్ వలస పేర్కొన్నారు.నల్లా నరసింహులు పోరాట స్ఫూర్తితో బీసీలు సంఘటితమై తమ వాటా సాధించుకోవాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో అజరామరుడిగా నిలిచిన నల్లా నరసింహులు భౌతికంగా దూరమైనా భావజాలంలో చిరంజీవి. ఆయన ఆశయాలు, త్యాగాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.

కరువు ప్రభావిత రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టాలి

- **ఖరీఫ్–2026 కరువు సహాయక చర్యలపై ప్రత్యేక డీసీసీ సమావేశం**

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 04



సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలను పునరుద్ధరించి, రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అర్హులైన రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ బ్యాంకు అధికారులకు సూచించారుబుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్-2026 కరువు సహాయక చర్యల్లో భాగంగా ప్రత్యేక డీసీసీ/డీఎల్ఆర్ఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతుల వ్యవసాయ పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ ఏఓ,లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆర్బీఐ ఎల్డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం వ్యవసాయ శాఖ అదనపు డీఏ వివిధ బ్యాంకుల అధికారులు హాజరయ్యారు కరువు ప్రభావిత మండలాల్లోని అర్హులైన రైతుల పంట రుణాలను నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరించడం, రుణాల తిరిగి చెల్లింపు గడువును పొడిగించడం,తాత్కాలిక వాయిదా సదుపాయం) కల్పించే అంశాల పై సమీక్షించారు ఈ సందర్భంగా ఏఓ విజయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు, సంబంధిత బ్యాంకుల పాలక మండళ్లు ఆమోదించిన విధానాలకు అనుగుణంగా అర్హులైన రైతులకు సహాయక చర్యలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. . రైతులకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ , ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2026 వరకు రెండు త్రైమాసికాల్లో జిల్లాలోని బ్యాంకులు మొత్తం 1,20,065 ఖాతాల ద్వారా రూ.2,520.18 కోట్ల పంట రుణాలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మొత్తం 28 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించగా, వాటిలో 2 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా, 26 మండలాలు మోస్తరు కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించినట్లు వివరించారు.పంట రుణాల పునర్వ్యవస్థీకరణ మాత్రమే ఈ ప్రక్రియలో భాగమని, దీనిని రుణమాఫీ పథకంగా భావించరాదని ఆయన స్పష్టం చేశారు ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.